# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 233 సోమవారం 4 మార్చి 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# కౌలు రైతులకు రైతు బంధు!



- రైతు కూలీలతో పాటు కౌలు రైతులకూ సాయం!
- రైతులకు శుభవార్త చెప్పిన రేవంత్.. 10 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశం..
- ఇప్పటి వరకు నాలుగు ఎకరాల లోపు వారికి రైతు బంధు సాయం పంపిణీ
- మిగతా వారికి కూడా వారం నుంచి పది రోజుల్లో జమ
- లోక్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కచ్చితంగా పంపిణీ పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం
- వచ్చే వానకాలం నుంచి రైతు భరోసా పథకం అమలు చేసే అవకాశం
- రైతు భరోసా ఐదు నుంచి పదేకరాల లోపు ఉన్నవారికే ఇచ్చే అవకాశం

హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డి రైతులకు శుభవార్త చెప్పారు. రైతు బంధు పంపిణీ పది రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు నాలుగు ఎకరాల లోపు వారికి రైతు బంధు సాయం పంపిణీ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మిగతా వారికి కూడా వారం నుంచి పది రోజుల్లో జమ చేస్తామని వివరించారు. లోక్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కచ్చితంగా పంపిణీ పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. రైతు బంధు కోసం మరో రూ. 3,500 కోట్లు అవసరం అవుతాయని ఈ సందర్భంగా అధికారులు రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. నిధులు విడుదల చేస్తామని.. ఆ వెంటనే పంపిణీ కూడా పూర్తి -మిగతా3లో

# 5న ప్రధాని మోదీ పర్యటన



- ప్రారంభించనున్న అభివృద్ధి కార్యక్రమాలు
- పటాన్ చెరులో బీజేపీ భారీ బహిరంగ సభ
- పౌరవిమానయాన పరిశోధనా సంస్థను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్న మోదీ
- రూ. 9,021 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన/ప్రారంభోత్సవాలు
- ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఐఐటీ, జాతీయ రహదారులు, గ్యాస్ పైప్ లాంటి వాటిని జాతికి అంకితం
- జిల్లాలో పలు కార్యక్రమాలకు మోదీ హాజరు

సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలో ప్రధాని నరేంద్ర మోడీ ఈనెల 5న పర్యటించనున్నారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు అధికారులు. మరో వైపు బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రధాని పర్యటన ఏర్పాట్లను దగ్గర ఉండి పరిశీలిస్తున్నారు. మోడీ రాక సందర్భంగా సంగారెడ్డి జిల్లా పటాన్ చెర్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నారు. ఈ సభ విజయవంతం అయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు -మిగతా3లో

## బీజేపీకి పార్టీ ఫండ్‌గా ప్రధాని మోదీ రూ.2వేల విరాళం



- 'డొనేషన్ ఫర్ నేషన్ బిల్డింగ్' లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మోదీ పిలుపు
- ఈ పేమెంట్‌కు సంబంధించిన స్లిప్ షేర్
- 'బీజేపీకి దోహదపడటం, వికసిత్ భారత్ నిర్మాణం కోసం మన ప్రయత్నాలను బలోపేతం చేయటం సంతోషంగా ఉంది
- 'నమో' యాప్ ద్వారా ప్రతీ ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని కోరుతున్నాను'

## నిరుద్యోగంలో భారత్ పాక్‌ను మించిపోయింది



- 'ఈ రోజులో గత 40 ఏళ్లలో లేని అత్యంత భారీ నిరుద్యోగం దేశంలో ఉంది
- పాకిస్తాన్‌లో ఉన్న నిరుద్యోగం కంటే రెండింతలు అధికంగా ఉంది.
- మోదీ తీసుకున్న నిర్ణయాల వల్ల చిరువ్యాపారులు కుదేలయ్యారు
- రైల్వే పాలసీలు ధనికుల కోసమే..
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



## మార్చి 15 నుంచి ఒంటి పూట బడులు

- ఒంటిపూట బడులు, వేసవి సెలవులపై ప్రభుత్వ నిర్ణయం..!!
- ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఒంటిపూట బడులు
- 10వ తరగతి పరీక్షలు జరిగే స్కూళ్లలో మాత్రం మధ్యాహ్నం క్లాసులు
- అన్ని పాఠశాలలకు విద్యా శాఖ అదేశాలు జారి
- రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బంది పడకుండా చర్యలు
- ఏప్రిల్ 25 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు
- జూన్ 12న ప్రారంభం పాఠశాలలు

హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ఒంటిపూట బడులపై కీలక నిర్ణయం తీసుకుంది. క్రమంగా ఎండలు పెరుగుతున్న వేళ ఈ నిర్ణయం తీసుకుంది. మార్చి 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ స్కూళ్లకు ఒంటి పూట బడులు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఒంటిపూట బడులు -మిగతా3లో

# లక్ అంటే వీళ్లదే

- ఇతర పార్టీల నుంచి వారికే ప్రాధాన్యత
- బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఆ ఐదుగురు నేతలకు బీజేపీ టిక్కెట్లు
- కురుక్షేత్రంలో తొలి పావును కదిపిన బీజేపీ
- ఎంపీ అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించిన అధిష్ఠానం
- ఈసారి 400కి పైగా సీట్లే టార్గెట్‌గా పనిచేస్తోన్న బీజేపీ
- ఈ 9 మంది పేర్లలో 5 మంది అభ్యర్థులు ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లే



హైదరాబాద్

సార్వత్రిక ఎన్నికల కురుక్షేత్రంలో తొలి పావును కదిపింది భారతీయ జనతా పార్టీ. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఎంపీ అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ అధిష్టానం ప్రకటించింది. 195 మంది అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటించింది. యువతకు ప్రాధాన్యత ఇస్తూ.. బీసీలు, మహిళలను చేర్చుకుంటూ తన జాబితాను రిలీజ్ చేసింది. ఈసారి 400కి పైగా సీట్లే టార్గెట్‌గా బీజేపీ పనిచేస్తోంది. సార్వత్రిక ఎన్నికల కురుక్షేత్రంలో తొలి పావును కదిపింది భారతీయ జనతా పార్టీ. లోక్‌సభ -మిగతా3లో



## రాష్ట్రంలో భానుడి ప్రతాపం

- రానున్న 5 రోజులు చెమటలు కక్కాల్సిందే!
- ఎండలు మరింత దంచికొట్టే అవకాశం
- రాష్ట్రంలోని సగం జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 37 డిగ్రీల సెల్సియస్‌ను దాటింది
- సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు
- ఎల్‌నినో ప్రభావంతో ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం

## అతికొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత

- ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలతో చర్చించి దిశా నిర్దేశం
- రైతులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది
- బీఆర్ఎస్‌తో మేలు జరుగుతుందనే చర్చ మొదలైంది
- శాసన సభ ఎన్నికల ఫలితాలు పట్టించుకోవద్దు
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు నీళ్లు, కరెంటు ఇవ్వడం లేదు
- కరీంనగర్ నుంచి బీఆర్ఎస్ ఎన్నికల శంఖారావం..
- 12న భారీ బహిరంగ సభ
- ఇద్దరు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు ఖరారు

హైదరాబాద్

భారత రాష్ట్ర సమితి లోక్‌సభ ఎన్నికలకు శంఖారావాన్ని పూరించింది. ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 12న కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ డిగ్రీ కళాశాల మైదానంలో బీఆర్ఎస్ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణ భవన్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ నేతలతో బీఆర్ఎస్ అధినేత ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికల్లో -మిగతా3లో



# బీజేపీ తొలి జాబితా.. శివరాజ్ చౌహాన్‌కు చోటు, ప్రగ్యా ఠాకూర్‌పై వేటు

**న్యూఢిల్లీ :** గత రెండు దశాబ్దాలుగా మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో దూసుకెళ్తున్న 'శివరాజ్ సింగ్ చౌహాన్'కు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల తొలి జాబితాలో స్థానం కల్పించింది. దీంతో ఈయన మధ్యప్రదేశ్‌లోని విదిషా నుంచి పోటీ చేయనున్నారు. శివరాజ్ సింగ్ చౌహాన్ వరుసగా మూడు సార్లు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించిన ఘనత చౌహాన్‌దే. లోక్‌సభ ఎన్నికలకు 195 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను బీజేపీ విడుదల చేయగా, జాబితాలో చోటు సంపాదించిన పేర్లు మాత్రమే కాకుండా.. లోపాలు ఉన్న అభ్యర్థుల పేర్లు కూడా ఎక్కువగానే ఉన్నాయి. వీరిలో ప్రధానంగా ఫైర్‌బ్రాండ్ లీడర్ ప్రగ్యా ఠాకూర్ ఉన్నారు. భోపాల్‌లో బీజేపీ ప్రగ్యా ఠాకూర్ స్థానంలో అలోక్ శర్మను ఎంపిక చేసింది. మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసు, నాథూరామ్ గాడ్సేను దేశభక్తుడు అని పేర్కొనడం మాత్రమే కాకుండా 2008 ఉగ్రదాడుల సమయంలో మరణించిన ముంబై ఏటీఎస్ మాజీ చీఫ్ హేమంత్ కర్కరే గురించి చేసిన కామెంట్లు అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించాయి. ఈ కారణంగానే లోక్‌సభ సీటు ఇవ్వలేదు. ప్రగ్యా ఠాకూర్ వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ తప్ప మరెవరూ స్పందించలేదు. ఆ సమయంలో క్షమాపణలు కోరినప్పటికీ.. నేను పూర్తిగా క్షమించలేనని మోదీ ఖరాకండిగా వెల్లడించారు. 2008 ఉగ్రదాడుల సమయంలో మాజీ చీఫ్ హేమంత్ కర్కరేపై వారు చేసిన వ్యాఖ్యలు కూడా అప్పట్లో సంచలనం సృష్టించాయి.



**అలాంటి నేతలకు 'నో టికెట్'.. బీజేపీ స్ట్రాటజీ ఇదే**

ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో 370 పై చిలుకు స్థానాల్లో నెగ్గాలని బీజేపీ లక్ష్యంగా నిర్ధేశించుకుంది. అందుకు తగ్గట్లే లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై తీవ్రంగా కసరత్తు చేస్తోంది. గెలుపు గుర్రాల్ని రంగంలోకి దించుతుంది. కేరాఫ్ కాంట్రవర్సీ అభ్యర్థుల్ని పక్కన పెట్టేస్తోంది.

తాజాగా బీజేపీ విడుదల చేసిన తొలి లోక్‌సభ అభ్యర్థుల జాబితాలో మొత్తం 33 స్థానాల్లో సిట్టింగ్ ఎంపీలకు టికెట్లను తిరస్కరించింది. కొత్త వారికి అవకాశం కల్పిచ్చింది. వారిలో ప్రగ్యా ఠాకూర్, రమేశ్ బిధూరి, పర్వేష్ సాహిబ్ సింగ్ వర్మలు ఉన్నారు. ఈ ముగ్గురు ఎంపీలు పార్లమెంటు లోపల, వెలుపల ఫైర్ బ్రాండ్ అనే ముద్ర ఉంది. కాబట్టే పార్టీ పెద్దలు కఠిన చర్యలు తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకుల అంచనా.

**సాధ్వీ ప్రజ్ఞా ఠాకూర్**

భోపాల్ నుంచి వివాదాస్పద ఎంపీ సాధ్వీ ప్రజ్ఞా ఠాకూర్‌లకు మొండిచేయి చూపింది బీజేపీ. ఆమె స్థానంలో అలోక్ శర్మకు చాన్స్ ఇచ్చింది. సాధ్వీ ప్రజ్ఞా ఠాకూర్‌పై గతంలో అనేక వివాదాలున్నాయి. మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసు,నాథూరామ్ గాడ్సేను దేశభక్తుడు అని వ్యాఖ్యానించడం, 2008 ఉగ్రదాడుల సమయంలో మరణించిన ముంబై ఏటీఎస్ మాజీ చీఫ్ హేమంత్ కర్కరే గురించి చేసిన కామెంట్లు అప్పట్లో పెను సంచలనంగా మారాయి. ఇలా సాధ్వీ సున్నితమైన అంశాల పట్ల వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు కమలం పెద్దలకు ఆగ్రహం తెప్పించింది. ఫలితం లోక్‌సభ సీటును తిరస్కరించింది.

**పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ**

రెండుసార్లు ఎంపీగా పనిచేసిన మాజీ సీఎం దివంగత సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పశ్చిమ ఢిల్లీ బీజేపీ ఎంపీ పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మకు టికెట్ ఇవ్వలేదు. 2020 ఢిల్లీ ఎన్నికలకు ముందు జరిగిన ఓ బహిరంగ సభలో ఓ వర్గాన్ని పూర్తిగా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఆ వ్యాఖ్యలే ఆయన సిట్టింగ్ ఎంపీ సీటుకు ఎసరు పెట్టాయి.

**రమేష్ బిధూరి**

లోక్‌సభలో చంద్రయాన్-3 విజయంపై చర్చ సందర్భంగా ఎంపీ డానిష్ అలీపై ఎంపీ దక్షిణ ఢిల్లీ ఎంపీ రమేష్ బిధూరి అనుచిత, మతపరమైన వ్యాఖ్యలను ఉపయోగించారు. దీంతో ప్రతిపక్ష పార్టీలు ఆయన వ్యాఖ్యలను ఖండించాయి. ఎంపీ బిధూరీ వ్యాఖ్యల పట్ల బీజేపీ పెద్దలు నోటీసులు జారీచేసింది. దీంతో ఆయన క్షమాపణలు చెప్పినా ఫలితం లేకపోయింది. చేసిన తప్పుకు మూల్యం చెల్లించుకోక తప్పలేదు. బీజేపీ విడుదల చేసిన తొలి లోక్‌సభ అభ్యర్థుల జాబితాలో స్థానం కోల్పోయారు.

## లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయలేను: బీజేపీ ఎంపీ అభ్యర్థి



**న్యూఢిల్లీ:** బీజేపీ తొలి జాబితాలో పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ సెగ్మెంట్ అభ్యర్థిగా ప్రకటించబడిన భోజ్‌పూరి నటుడు, గాయకుడు పవన్ కుమార్ సింగ్ తాను లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించారు. 'నాపై బీజేపీ అధినాయకత్వం పూర్తి నమ్మకంతో నాకు అసన్‌సోల్ నియోజకవర్గం సీటు కేటాయించింది. కానీ, నేను పోటీ చేయలేను. కొన్ని కారణాల వల్ల నేను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను' అని పవన్ కుమార్ సింగ్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా ప్రకటించారు. బిహార్‌కు చెందిన పవన్ కుమార్ సింగ్‌ను బెంగాల్‌లోని అసన్‌సోల్ నియోజకవర్గం నుంచి బీజేపీ పోటీకి దించటంపై పెద్ద ఎత్తున దుమారం రేపింది. బెంగాలీ మహిళలపై అభ్యంతరకరమైన పాటలను రూపొందించినట్లు ఆయనపై సోషల్ మీడియాలో వ్యతిరేకత వ్యక్తం అయింది. దీంతో పవన్‌కుమార్ అభ్యర్థిత్వం వల్ల అసన్‌సోల్ నియోజకవర్గంలో ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తుందని బీజేపీ ఇప్పటికే గుర్తించినట్లు తెలుస్తోంది. అంతలోనే పవన్‌కుమార్ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించటం గమనార్హం. బీజేపీ తొలి జాబితాలోనే పశ్చిమ బెంగాల్‌లో 20 మంది అభ్యర్థులను ప్రకటించింది. ప్రకటించిన 20 మందిలో అసన్‌సోల్ సెగ్మెంట్ నుంచి పవన్ కుమార్ సింగ్‌కు అవకాశం ఇచ్చింది బీజేపీ అధిష్టానం. అభ్యర్థిని ప్రకటించిన తర్వాత ఇలా.. పోటీ నుంచి పవన్ కుమార్ వైదొలుగుతున్నట్లు ప్రకటించటంపై బెంగాల్ బీజేపీలో తీవ్ర చర్చ జరుగుతోంది. దీనిపై కాంగ్రెస్ నేతలు సైతం విమర్శలు చేస్తున్నారు.

## 'ఇక రాజకీయాలకు సెలవు'..బీజేపీ నేత కీలక ప్రకటన



లోక్‌సభ ఎన్నికల ముందు కేంద్ర మాజీ ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ సీనియర్ నేత డాక్టర్ హర్ష వర్ధన్ కీలక ప్రకటన చేశారు. రాజకీయాల నుంచి రీటైరవుతున్నట్లు చెప్పారు. 'ముప్పై సంవత్సరాలకు పైగా అద్భుతమైన రాజకీయ జీవితం. ఐదు అసెంబ్లీ, రెండు పార్లమెంటరీ ఎన్నికలలో గెలిచాను. పార్టీలో,రాష్ట్రంలో,కేంద్రంలో అనేక కీలక పదవుల్లో బాధ్యతలు నిర్వహించాను. ఇప్పుడు తిరిగి వైద్య వృత్తిలో కొనసాగేందుకు సిద్ధంగా ఉన్నానంటూ ట్వీట్ చేశారు. %మానవాళికి సేవ చేయాలనే నినాదంతో నేను యాభై ఏళ్ల క్రితం కాన్పూర్‌లోని జీఎస్‌వీఎం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో చేరాను. కోవిడ్-19 మహమ్మారి వంటి కఠిన సమయాల్లో ప్రాణాలతో పోరాడుతున్న లక్షల మంది ప్రజల్నీ ఆరోగ్యాన్ని కాపాడే అవకాశం నాకు దక్కింది. ఇప్పుడు రాజకీయాలకు స్వస్తి చెప్పి ఢిల్లీ కృష్ణా నగర్‌లోని నా ఈఎన్‌టీ క్లీనిక్‌లో వైద్య సేవలందిస్తా. నాకోసం క్లీనిక్ ఎదురు చూస్తోంది అంటూ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## నిరుద్యోగంలో భారత్ పాక్‌ను మించిపోయింది

**భోపాల్:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయాల వల్ల చిరువ్యాపారులు కుదేలయ్యారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో భాగంగా రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్‌లోని ఓ సభలో మాట్లాడారు. 'ఈ రోజులో గత 40 ఏళ్లలో లేని అత్యంత భారీ నిరుద్యోగం దేశంలో ఉంది. పాకిస్తాన్‌లో ఉన్న నిరుద్యోగం కంటే రెండింతలు అధికంగా ఉంది. బంగ్లాదేశ్, భూటాన్ దేశాలో కంటే ఎక్కువ నిరుద్యోగం భారత్‌లో ఉంది. దానికి గల కారణం ప్రధాని మోదీ అమలు చేసిన విధానాలు. ప్రధాని మోదీ తీసుకున్న నోట్ల రద్దు,




జీఎస్టీ నిర్ణయాల వల్ల చిరు వ్యాపారులు కుదేలయ్యారు' అని రాహుల్‌గాంధీ మడిపడ్డారు. అంతకు ముందు మరో సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. గతంలో చేపట్టిన యాత్ర కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు సాగింది. అయితే మిగతా రాష్ట్రాలు పశ్చిమ బెంగాల్, జార?ండ్, ఛత్తీస్‌ఘడ్, గుజరాత్ ఎందుకు వెళ్లలేదని ప్రజలు తనను ప్రశ్నించారని తెలిపారు. అందుకే మరో యాత్ర చేపట్టానని.. ఇది న్యాయ కోసం చేసే యాత్ర అని రాహుల్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ యాత్ర మధ్యప్రదేశ్‌లో ప్రవేసించిన ఇవాళ ఉదయం ఆయన ఎక్స్ సర్వీస్‌మెన్, అగ్నీవీర్లతో మాట్లాడారు. ఈ రోజు రాహుల్ గాంధీ బిహార్‌లో జరిగే 'ఇండియా కూటమి' ర్యాలీ సందర్భంగా తన యాత్రకు బ్రేక్ ఇవ్వనున్నారు. తిరిగి సోమవారం ప్రారంభమై మధ్యప్రదేశ్‌లో పలు జిల్లాకుండా కొనసాగనుంది.

**రైల్వే పాలసీలు ధనికుల కోసమే..**

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైల్వే పాలసీలపై రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శలు గుప్పించారు. రైల్వే పాలసీలన్నీ కేవలం ధనికుల కోసమే తీసుకువచ్చారని మండిపడ్డారు. 'ప్రతి ఏడాది 10 శాతం రైల్వే చార్జీలు పెంచుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజలను దోపిడి చేస్తోంది. క్యాన్సలేషన్ చార్జీలు పెంచుతోంది. ప్లాట్‌ఫామ్ టికెట్ చార్జీలు పెంచింది. ఉన్నత వర్గానికి చెందిన రైలు పేరుతో ప్రజలను దోపిడి చేస్తోంది. పేదలు కనీసం ఆ రైలులో కాలుపెట్టలేని పరిస్థితి ఉంది. ... రైళ్లలో ఏసీ కోచ్‌లు సంఖ్య పెంచి.. జనరల్ కోచ్‌లు సంఖ్య తగ్గించారు. జనరల్ కోచ్‌ల తగ్గింపుతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ కోచ్‌ల తయారీ కంటే మూడు రెట్లు ఎక్కవ ఏసీ కోచ్‌లు తయారు చేస్తున్నారు. రైల్వే బడ్జెట్ విడిగా ప్రవేశపెట్టడం ఆపేయటం మూలంగా రైల్వేలో జరిగే కుట్రలు తెలియటం లేదు' అని రాహుల్ గాంధీ 'ఎక్స్' ట్విటర్‌లో మండిపడ్డారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. కానిస్టేబుల్ మృతి


**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో ఆదివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక పోలీస్ కానిస్టేబుల్‌తో పాటు ఒక మావోయిస్టు మృతి చెందారు. జిల్లాలోని హిందూర్ అటవీ ప్రాంతంలోని చోటేబేటియా పోలస్ స్టేషన్ పరిధిలో కూంబింగ్ చేస్తుండగా పోలీసులకు, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో బస్తర్ ఫైటర్స్ యూనిట్‌కు చెందిన కానిస్టేబుల్ రమేష్ మృతి చెందాడు. సంఘటనా స్థలంలో ఒక మావోయిస్టు మృతదేహంతో పాటు ఏకే 47 తుపాకీని పోలీసులు కనుగొన్నారు. కూంబింగ్ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.కాగా, గత నెలలో బస్తర్ ప్రాంతంలోని సుక్మా, బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లతో



పాటు ఇద్దరు స్పెషల్ బెటాలియన్ కమాండోలు చనిపోయారు.

## 'మోదీకి రెండు నిమిషాల పని..

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో గుండాలు, అత్యాచార నేరస్తులు అధికార పార్టీ టీఎంసీ జెండా కింద రక్షింపబడుతున్నారని బీజేపీ ఎంపీ దిలీప్ ఘోష్ సీఎం మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించారు. 'బెంగాల్‌లో గుండాలు, అత్యాచారానికి పాల్పడే వ్యక్తులు ఎక్కువ అయ్యారు. వారంతా కూడా టీఎంసీ జెండా కింద రక్షణ పొందుతున్నారు. టీఎంసీ నేరస్తులను, అత్యాచార నిందితులను రెండు నెలల నుంచి కాపాడుతోంది. బీజేపీ, మీడియా నిరసనల నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితుల్లో రాష్ట్ర పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. ... తర్వాతే ఆయన్ను టీఎంసీ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. టీఎంసీ పార్టీ బెంగాల్ మొత్తాన్ని నాశనం చేస్తోంది. మహిళల నుంచి భూములు లాక్కుంటున్నారు. కశ్మీర్ సమస్యను పరిష్కరించిన ప్రధానమంత్రి మోదీకి.. బెంగాల్‌లో పరిస్థితులను శాంతింప చేయటం కేవలం రెండు నిమిషాల పని' అని ఎంపీ దిలీప్



ఘోష్ అన్నారు. శనివారం బీజేపీ ప్రకటించిన తొలి జాబితాలో బెంగాల్ నుంచి మొత్తం 42 స్థానాలకు 20 మంది అభ్యర్థులను ప్రకటించింది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 18 సీట్లను గెలుచేకున్న విషయం తెలిసిందే. ఈసారి బెంగాల్ 35 స్థానాల్లో విజయం సాధించాలని బీజేపీ టార్గెట్ పెట్టుకుంది.

## హైదరాబాద్ రామేశ్వరం కేఫ్ సందర్శించిన అసదుద్దీన్ ఒవైసీ



ఇటీవల బెంగళూరులోని ప్రముఖ రామేశ్వరం కేఫ్‌లో శుక్రవారం పేలుడు సంభవించడంతో 10 మంది గాయపడ్డారు. పేలుడు సమయంలో గాయపడ్డ బాధితులకు సంఘీభావం తెలిపేందుకు ఆల్ ఇండియా మజ్లిస్-ఈ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (%ూ×వీ×వీ%) అధినేత అసదుద్దీన్ ఒవైసీ శనివారం హైదరాబాద్‌లోని రామేశ్వరం కేఫ్‌ను సందర్శించారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జన్మస్థలంతో కేఫ్‌కు ఉన్న అనుబంధాన్ని గురించి గుర్తు చేస్తూ.. బెంగళూరులో జరిగిన సంఘటనను అసదుద్దీన్ ఖండించారు. అసదుద్దీన్ ఎక్స్ (ట్విటర్) వేదికగా రామేశ్వరం కేఫ్‌లో ఫుడ్ బాగుందని. ఏపీజే అబ్దుల్ కలాం జన్మస్థలం పేరు కేఫ్ అని గుర్తుంచుకోవడం చాలా ముఖ్యమని, రామేశ్వరం కేఫ్ బ్లాస్ట్ అనేది ఓ పిరికిపంద చర్య అని వెల్లడించారు. కేఫ్‌లో భోజనం చేస్తూ అసదుద్దీన్ అక్కడున్న కొంతమంది సందర్శకులతో కూడా మాట్లాడారు. ఇకపోతే.. బెంగళూరు రామేశ్వరం కేఫ్‌లో జరిగిన సంఘటన మీద కర్ణాటక పోలీసులు సోదాలు నిర్వహిస్తున్నారు. పేలుడుకు సంబంధించిన ఖచ్చితమైన నిజానిజాలను తెలుసుకోవాలని అక్కడి ప్రభుత్వం అధికారులను ఇప్పటికే ఆదేశించింది. అంతే కాకుండా ఇకపైన కూడా జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్‌ను పెంచాలని అధికారులను ఆదేశించారు. రామేశ్వరం కేఫ్ ఫౌండర్ అండ్ సీఈఓ రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలని, అటువంటి చర్యలకు పాల్పడిన వారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘటనలో గాయపడిన ప్రజలకు, సిబ్బందికి తన సంఘీభావం తెలియజేస్తూ.. వారికి అండగా మేమున్నామనే ధైర్యం చెప్పారు.

## రవిశంకర్ గురూజీని కలిసిన తమిళనాడు బీజేపీ ప్రెసిడెంట్



వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని, అయితే పార్టీ తీసుకునే ఏ నిర్ణయానికైనా కట్టుబడి ఉంటానని తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కె అన్నామలై పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీ ఎదుగుదల కోసం బీజేపీ నాకు కొంత బాధ్యతను అప్పగించిందని, తాను ఆ పని చేస్తున్నానని చెప్పారు. దిలా ఉండగా ఈరోజు ఉదయం అన్నామలై కోయంబత్తూరులో గురుదేవ్ రవిశంకర్ ఆశీస్సులు పొందే అవకాశం లభించిందని తన ఎక్స్ (ట్విటర్) ఖాతాలో వెల్లడిస్తూ.. కోయంబత్తూరులో 'డ్రగ్స్ ఫ్రీ ఇండియా ఫర్ ఏ హొలిస్టిక్ సొసైటీ' కోసం గురుదేవ్ చొరవ చాలా ముఖ్యమైందని అన్నారు. గురుదేవ్ రవిశంకర్ గురూజీని అన్నామలై కలిసిన ఫోటోలు ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఇందులో గురూజీ అన్నామలైను సత్కరించడం చూడవచ్చు. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి.

## బీజేపీకి పార్టీ ఫండ్‌గా ప్రధాని మోదీ రూ.2వేల విరాళం



**ఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీజేపీ పార్టీకి రూ.2000 విరాళంగా ఇచ్చారు. 'నమో' యాప్ ద్వారా శనివారం ఈ విరాళాన్ని ప్రధాని మోదీ బీజేకి పార్టీ ఫండ్‌గా అందజేశారు. ఈ సందర్భంగా 'నమో' యాప్ ద్వారా 'డొనేషన్ ఫర్ నేషన్ బిల్డింగ్' లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ పేమెంట్‌కు సంబంధించిన స్లిప్‌ను షేర్ చేశారు. 'బీజేపీకి దోహదపడటం, వికసిత్ భారత్ నిర్మాణం కోసం మన ప్రయత్నాలను బలోపేతం చేయటం సంతోషంగా ఉంది. 'నమో' యాప్ ద్వారా ప్రతీ ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని కోరుతున్నాను' అని ప్రధాని మోదీ 'ఎక్స్ 'లో పోస్ట్ చేశారు. డొనేషన్ ఫర్ నేషన్ బిల్డింగ్.. ప్రచార కార్యక్రమాన్ని మార్చి 1 నుంచి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రారంభించారు. ఆయన కూడా రూ. 1000 విరాళాన్ని పార్టీకి అందించారు. 'ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ నిర్మాణం కోసం నేను బీజేపీకి విరాళం ఇచ్చాను. నమో యాప్ ద్వారా అందరూ 'డొనేషన్ ఫర్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమంలో పాల్గొనండి' అని జేపీ నడ్డా 'ఎక్స్' ద్వారా పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాల ప్రకారం.. 2022-2023 ఏడాదిలో బీజేపీ రూ. 719 కోట్లు సేకరించినట్లు తెలిపింది. అదేవిధంగా 2021-2022తో పోల్చితే 17 శాతం అధికం. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ 2022 - 2023 ఏడాదికి రూ. 79 కోట్లు, 2021-2022 ఏడాదికి రూ. 95.4 కోట్లు పార్టీ ఫండ్ సేకరించినట్లు పేర్కొంది.

## టీఎంసీతో పొత్తుకు ఇంకా తలుపులు తెరిచే ఉన్నాయి - జైరాం రమేష్



పశ్చిమ బెంగాల్‌లో మొత్తం 42 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయాలని తృణమూల్ కాంగ్రెస్ నిర్ణయించుకున్నప్పటికీ, వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీతో పొత్తుకు ఇంకా తలుపులు తెరిచి ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది. పాట్నాలో ప్రతిపక్షాల ర్యాలీకి ముందు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి %ది% కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జైరాం రమేష్ మాట్లాడుతూ.. మమతా బెనర్జీ ఏకపక్షంగా 42 స్థానాలకు (పశ్చిమ బెంగాల్‌లో) పోటీ చేస్తానని ప్రకటించింది, కానీ మాకు సంబంధించినంతవరకు, చర్చలు ఇంకా కొనసాగుతున్నాయి, వారి కోసం తలుపులు తెరిచి ఉన్నాయని.. ఆఖరి మాట చెప్పేంత ఈ అవకాశం ఉంటుందని అన్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రదానం చేసిన వారం రోజుల తర్వాత రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్ఎల్‌డి) %చీణూ% కూటమిలో చేరింది. అలీఘర్‌లో యాత్రలో రాహుల్ గాంధీకి లోక్ దళ్ స్వాగతం పలికిందని రమేష్ అన్నారు. రాహుల్ గాంధీ వయనాడ్ లోక్‌సభ స్థానం (కేరళలోని) నుంచి పోటీ చేస్తారా అనే ప్రశ్నకు జవాబిస్తూ.. ఆ విషయం ప్రస్తుతం చర్చలో ఉందని త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడుతుందని అన్నారు.

# బీజేపీ తొలి లిస్ట్‌లో 'నో' ప్లేస్

## ఎంపీ సోయం బాపురావు సంచలన కామెంట్స్

**ఆదిలాబాద్:** తనకు లోక్‌సభ స్థానం నుంచి టికెట్ రాకుండా పార్టీ అగ్రనేతలే అడ్డుపడ్డారని బీజేపీ ఎంపీ సోయం బాపురావు సంచలన కామెంట్స్ చేశారు. నా బలం.. బలగం కావాలనుకుంటే పార్టీ టికెట్ ఇస్తుంది అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాగా, బీజేపీ హైకమాండ్ రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటు, తెలంగాణలో కూడా తొమ్మిది మంది అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. ఈ క్రమంలో ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు పేరు తొలి లిస్టులో రాలేదు. ఆదిలాబాద్ గురించి హైకమాండ్ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇక, తొలి జాబితాలో తన పేరు లేకపోవడంతో బాపురావు స్పందిస్తూ షాకింగ్ కామెంట్స్ చేశారు. ఈ నేపథ్యంలో బాపురావు ఆదివారం మీడియాతో



మాట్లాడుతూ.. నాకు టికట్ రాకుండా పార్టీ అగ్రనేతలే అడ్డుపడ్డారు. ఆదివాసీ నేతకు టికెట్ రాకుండా పావులు కదిపారు. నేను ఎక్కడో గెలుస్తానో అనే భయం వాళ్లకు ఉంది. కొమ్మపై ఆధారపడే పక్షిని కాదు నేను.. రెక్కల మీద ఆధారపడిన పక్షిని.. నేను స్వతహాగా ఎగురగలను. టికెట్ రాకపోతే నా దారి నేను చూసుకుంటాను. ఆదిలాబాద్ పార్లమెంట్ సీటు నాదే.. గెలిచేది కూడా నేనే. పార్టీ ఏదనేది అధిష్ఠానం ఆలోచించుకోవాలి. 2019లో టికెట్ ఇస్తా అంటే పారిపోయిన నేతలే టికెట్ కోసం ఇప్పుడు పోటీపడుతున్నారు. ఏ బలంలేని సమయంలో నా సొంత బలంతో బీజేపీకి విజయం అందించాను. జడ్పీటీసీలను, ఎంపీపీలను, చివరికి నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించాను. నా బలం, బలగం కావాలనుకుంటే పార్టీ టికెట్ ఇస్తుంది. రెండో లిస్ట్‌లో నాకు టికెట్ వస్తుందని భావిస్తున్నాను. ఎవరి మీద ఆధారపడే నేతను నేను కాదు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### రాష్ట్రంలో భానుడి ప్రతాపం..

**హైదరాబాద్ :** హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో వేసవి ప్రారంభం కాకముందే.. ఎండలు మండి పోతున్నాయి. మార్చి మొదటి వారంలో వేడి విపరీతంగా పెరిగింది. రాష్ట్రంలోని సగం జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 37 డిగ్రీల సెల్సియస్‌ను దాటింది. రానున్న 5 రోజులు ఉష్ణోగ్రతలు పెరగనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీంతో ఎండలు మరింత దంచికొట్టే అవకాశం ఉంది. సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. దీంతో పగటి వేళలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కాగా, ఎల్‌నినో ప్రభావంతో ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.
ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తర కర్ణాటకతో పాటు మహారాష్ట్ర, ఒడిశాలోని అనేక ప్రాంతాల్లో సాధా రణం కంటే ఎక్కువ రోజులు వేడిగాలులు వీసే అవకాశాలున్నాయని తెలిపింది.
మార్చి-మే మధ్య కాలంలో దేశంలో అనేక చోట్ల సాధారణం కంటే గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని భారత వాతావరణశాఖ గతంలోనే హెచ్చరించిన విషయం తెలిసిందే.

# 5న ప్రధాని మోదీ పర్యటన

-మొదటి పేజి తరువాయి

బీజేపీ నాయకులు. ప్రధానమంత్రి మోడీ సంగారెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా మొదట బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. బేగంపేట విమానాశ్రయంలోనే నిర్మించిన పౌరవిమానయాన పరిశోధనా సంస్థ ను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం సంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొననున్నరు. రూ. 9,021 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన/ప్రారంభోత్సవం చేయనున్నారు.
కాషాయ దళపతి తెలంగాణ రాష్ట్రంలో పర్యటించనున్న సందర్భంగా సంగారెడ్డి జిల్లాలో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో పలు కార్యక్రమాలకు మోదీ హాజరుకానున్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఐఐటీ, జాతీయ రహదారులు, గ్యాస్ పైప్ లాంటి వాటిని జాతికి అంకితం చేయనున్నారు. 5న సంగారెడ్డి రానున్న మోదీ ముఖ్యంగా సంగారెడ్డి నుండి మదీనాగూడ వరకు దాదాపు రూ. 1300 కోట్ల రూపాయలతో రహదారి విస్తరణ పనులను అలాగే, రూ. 600 కోట్ల రూపాయలతో నిర్మించిన ఐఐటీనీ, రూ. 399 కోట్లతో మెదక్ ఎల్లారెడ్డి రహదారి విస్తరణ, రూ. 400 కోట్లతో నిర్మించిన సివిల్స్ ఏషియన్ క్లబ్ భవనాలను జాతికి అంకితం చేయనున్నారు. ఈ



సందర్భంగా జిల్లా అంతటా ఎటువంటి అవంఛనీయమైన సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు పోలీసులు. ప్రధాని మోడీ సంగారెడ్డికి చేరుకున్నాక ఐఐటీ ప్రాంగణంలో హెలికాప్టర్ లాండింగ్ చేయనున్నారు. ఐఐటీ ప్రాంగణంలో సమావేశం ఉంటుంది. మరోవైపు ప్రస్తుతం తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మోదీ పర్యటన రాష్ట్రంలో కీలకం కానుంది. ప్రస్తుతం మోదీ హవా నడుస్తున్న సందర్భంగా సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే బహిరంగ సభపై ఇక్కడి బిజెపి అభ్యర్థుల గెలుపు భవితవ్యం ఆధారపడి ఉంది. 5న పటాన్ చెరులోని పటేల్ గుడలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభలో మోదీ పాల్గొంటారు.

# లక్ అంటే వీళ్లదే..



-మొదటి పేజి తరువాయి

ఎన్నికలకు సంబంధించి ఎంపీ అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ అధిష్టానం ప్రకటించింది. 195 మంది అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటించింది. యువతకు ప్రాధాన్యత ఇస్తూ.. బీసీలు, మహిళలను చేర్చుకుంటూ తన జాబితాను రిలీజ్ చేసింది. ఈసారి 400కి పైగా సీట్లే టార్గెట్‌గా బీజేపీ పనిచేస్తోంది. మరికొన్ని రోజుల్లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ సమర శంఖం పూరించింది. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను ఆ పార్టీ విడుదల చేసింది. మొత్తం 195 స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి వారణాసి నుంచి బరిలోకి దిగనున్నారు. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్‌డే అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. తెలంగాణ నుంచి తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ముగ్గురు సిట్టింగ్ ఎంపీలకు మళ్లీ పోటీ చేసేందుకు అవకాశం కల్పించింది.
ఈ 9 మంది పేర్లలో 5 మంది అభ్యర్థులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, బూర నర్సయ్య గౌడ్, పోతుగంటి భరత్, బీబీ పాటిల్. గతంలో ఈ ఐదుగురు అభ్యర్థులు భారత రాష్ట్ర సమితితో క్రియాశీలకంగా వ్యవహారించారు. బీఆర్ఎస్ పార్టీని వీడి బీజేపీలో చేరిన ఈ ఐదుగురు తొలి జాబితా ప్రకటించిన తొమ్మిది మందిలో చోట సంపాదించుకోవడం ఆసక్తికరంగా మారింది.

### కొండా విశ్వేశ్వర్ రెడ్డి

కొండా విశ్వేశ్వర్ రెడ్డి 2013లో తెలంగాణ రాష్ట్ర సమితి ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆ తర్వాత 2018లో గులాబీ పార్టీని వీడి భారత జాతీయ కాంగ్రెస్‌లోకి మారారు. 2021లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, చివరకు అదే సంవత్సరంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. చేవెళ్ల నియోజకవర్గం నుంచి %దీ=రా% పార్టీ తరుపున పోటీ చేసి 16వ లోక్‌సభలో పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యారు. మరోసారి రాబోయే లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ తరుపున బరిలో దిగుతున్నారు. న్యూ ఢిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ స్మాల్ స్టేట్స్ సభ్యుడిగా విశ్వేశ్వర్ రెడ్డి పనిచేసిన భారత న్యాయవ్యవస్థలో ప్రముఖ వ్యక్తి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి మొదటి ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన కాంగ్రెస్ అనుభవజ్ఞుడైన కెవి రంగా రెడ్డి మనవడు. రంగారెడ్డి జిల్లాకు ఆయన పేరు పెట్టారు. హైదరాబాద్ హైకోర్టు, బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన కొండా మాధవ రెడ్డి తనయుడే విశ్వేశ్వర రెడ్డి. 528 కోట్ల ఆస్తులతో 2014 -2019 మధ్యకాలంలో తెలంగాణ నుండి అత్యంత ధనిక ఎంపీగా ఉన్నారు. అతను అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ ప్రతాప్ సి రెడ్డికి అల్లుడు. అతని భార్య సంగీత రెడ్డి అపోలో హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.
విశ్వేశ్వర్ రెడ్డి ఒక విజయవంతమైన సాఫ్ట్‌వేర్ వ్యవస్థాపకుడు. ఇంజనీరింగ్ పరిశోధన, అభివృద్ధిలో పాలుపంచుకున్న సిటాడెల్ రీసెర్చ్ %డ% సొల్యూషన్స్ సంస్థ వ్యవస్థాపకుడు. అనేక IPRల సృష్టిలో పాల్గొన్నారు.

### ఈటల రాజేందర్

ఒకప్పుడు బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావుకు కుడిభుజంగా పేరుగాంచిన ఈటల రాజేందర్ పార్టీ సీనియర్ నాయకులు కేటీ రామారావు, టి హరీష్ రావులతో పాటు గులాబీ పార్టీ హైకమాండ్‌లో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడేందుకు తెలంగాణ రాష్ట్ర సమితిని కేసీఆర్ ప్రకటించిన రెండేళ్ల తర్వాత 2003లో టీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ మంత్రివర్గంలో 2014 నుండి 2018 వరకు ఆర్థిక మంత్రిగా, తరువాత 2019 నుండి 2021 వరకు కేసీఆర్ మంత్రివర్గంలో ఆరోగ్య మంత్రిగా పనిచేశారు. మే 2021లో మెదక్ జిల్లాలోని అచ్చంపేట్, హకీంపేట్ గ్రామాలలో భూ ఆక్రమణల ఆరోపణలను ఈటల ఎదుర్కొన్నారు. ఆయనను కేసీఆర్ మంత్రి పదవి నుండి తొలగించారు. తరువాత జూన్ 4 న %దీ=రా% పార్టీకి రాజీనామా చేసిన ఈటెల భారతీయ జనతా పార్టీలో చేరారు. అనేక అంశాలపై వివిధ వేదికలపై కేసీఆర్‌పై రాజేందర్ బహిరంగంగా విభేదించిన తర్వాత అవినీతి ఆరోపణలు రావడం గమనార్హం. 2021లో హుజూరాబాద్ నుంచి ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా గెలుపొందారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్‌లో పోటీ చేసి కేసీఆర్‌ను గజ్వేల్‌లో సవాలు చేశారు. అయితే రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ చేతిలో ఓడిపోయారు. ముదిరాజ్ సంఘం (బీసీ) నాయకుడు ఇప్పుడు హైదరాబాద్‌లోని మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి నామినేషన్ వేశారు.

### బూర నర్సయ్య గౌడ్

2009లో భారత రాష్ట్ర సమితిలో చేరిన బూర నర్సయ్య గౌడ్, 2014 ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గం నుంచి 16వ లోక్‌సభలో పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయారు. తెలంగాణలో బలమైన గౌడ్ సామాజిక వర్గానికి చెందిన బూర నర్సయ్య గౌడ్, 15 అక్టోబర్ 2022న %దీ=రా% కి రాజీనామా సమర్పించారు. 19 అక్టోబర్ 2022 న %దీభీు% లో చేరారు. వృత్తిరీత్య వైద్యులైన బూర లాపరోస్కోపిక్, ఊబకాయం, జీర్ణాశయాంతర సర్జన్‌గా కూడా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రతిపాదకుడు, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (%జీూజ%) సభ్యుడుగా కొనసాగారు. ప్రస్తుతం హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాపరోఎండోస్కోపిక్ సర్జరీ (%ఎ×ూూ%) డైరెక్టర్‌గా ఉన్నారు. హైదరాబాద్ నగరంలోని ఆదిత్య హాస్పిటల్, కేర్ హాస్పిటల్‌లో సేవలు అందిస్తున్నారు. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ ఏర్పాటుపై తనను సంప్రదించలేదని, పార్టీ ఎజెండా గురించి తనకు తెలియదని పేర్కొంటూ పార్టీ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ 2022లో బీఆర్ఎస్ నుంచి వైదొలిగారు. ఇక తాజాగా బీజేపీలో చేరిన ఆయన భువనగిరి నుండి లోక్‌సభ ఎన్నికలకు మరో పోటీకి సిద్ధమవుతున్నారు.

### పోతుగంటి భరత్

నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు కుమారుడు పోతుగంటి భరత్ తన తండ్రితో కలిసి బీజేపీలో చేరారు. లోక్‌సభ ఎన్నికల తొలి జాబితాను ప్రకటించడానికి రెండు రోజుల ముందే బీజేపీలో చేరారు. అదే స్థానం నుంచి లోక్‌సభ ఎన్నికలకు రాములుకు బదులుగా భరత్ పేరును కాషాయ పార్టీ ప్రతిపాదించింది. భరత్ బీఆర్ఎస్ పార్టీ మారక ముందు యువ నాయకుడిగా పనిచేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన రాములు జిల్లాలో పలుకుబడి కలిగి ఉన్నారు. ఆయన కుమారుడు అదే స్థానం నుండి రాబోయే లోక్‌సభ ఎన్నికల పోటీకి సిద్ధమవుతున్నారు. కల్వకుర్తి మండలం గుండూరు గ్రామానికి చెందిన రాములు 1994లో రాజకీయాల్లోకి రాకముందు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కెరీర్ ప్రారంభించారు. అచ్చంపేట అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి 1994, 1999, 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో క్రీడలు, యువజన సర్వీసుల మంత్రిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత, టిడిపి నుండి బిఆర్ఎస్‌లోకి మార్చారు. 2019 లోక్ సభ ఎన్నికలలో నాగర్ కర్నూల్ నుండి విజయం సాధించారు.

### బీబీ పాటిల్

పోతుగంటి రాములు, ఆయన కుమారుడు చేరిన వెంటనే జహీరాబాద్ నుంచి రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్ మార్చి 1న భారతీయ జనతా పార్టీలో చేరారు. గత రెండు దఫాలుగా బీఆర్ఎస్ పార్టీ తరుపున జహీరాబాద్ పార్లమెంటు సభ్యులుగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు బీబీ పాటిల్. వరుసగా 2014, 2019 ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి నాటి టీఆర్ఎస్, తాజాగా బీఆర్ఎస్ నుంచి రెండు సార్లు ఎంపీగా గెలుపొందారు. జహీరాబాద్ నియోజకవర్గంలో మంచి పట్టు సాధించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన తరువాత ఆయనతో బీజేపీ నేతలు టచ్ లోకి వెళ్లారు. ఇక అభ్యర్థుల కోసం పార్టీ ఎంపిక ప్రక్రియలో కుల సమీకరణాలు, అంతర్గత సర్వేలు, అభ్యర్థుల గెలుపోటము వంటి అనేక అంశాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. తెలంగాణాలో కనీసం 10 లోక్‌సభ స్థానాలను సాధించాలని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా లక్ష్యంగా నిర్దేశించారు. రాష్ట్రంలో పార్టీ ఉనికిని విస్తరించాలనే బలమైన సంకల్పాన్ని సూచిస్తుంది. బిజెపి తన ఎన్నికల లక్ష్యాలను సాధించడానికి తెలంగాణ వ్యాప్తంగా యాత్రలు, రోడ్‌షోల ద్వారా ఓటర్లకు దగ్గరయ్యేందుకు చురుకుగా పాల్గొంటోంది. అట్టడుగు స్థాయి ప్రజలతో మమేకం కావడం, వారి ఆందోళనలను అర్థం చేసుకోవడం, రాబోయే ఎన్నికల్లో వారి మద్దతు కోరడం లక్ష్యంగా ఈ ఔట్ రీచ్ ప్రయత్నాలు జరుగుతున్నాయని పార్టీ పేర్కొంది.

### పొలిటికల్ ట్విస్ట్..
### సీఎం రేవంత్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే



**హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల వేళ తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ నేతలో ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు భేటీ కావడం హాట్ టాపిక్‌గా మారింది. వివరాల ప్రకారం.. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు భేటీ అయ్యారు. ఆదివారం ఉదయం వెంకట్రావ్ తన కుటుంబసభ్యులతో వెళ్లి సీఎం రేవంత్‌ను కలిశారు. వారితో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నారు. దీంతో, ఆయన పార్టీ మారుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇక, ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత సీఎంను వెంకట్రావ్ కలవడం ఇది రెండోసారి. అనంతరం, వెంకట్రావ్ మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశాను. భద్రాచలం రామాలయం అభివృద్ధి. ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలి. భద్రాచలం పట్టణంలో డంపింగ్ యార్డు సైతం లేదు. పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం సీఎం రేవంత్‌ను కలిశాను అని అన్నారు.

### మార్చి 15 నుంచి ఒంటి పూట బడులు



-మొదటి పేజి తరువాయి

కొనసాగుతాయి. అయితే.. 10వ తరగతి పరీక్షలు జరిగే స్కూళ్లలో మాత్రం మధ్యాహ్నం క్లాసులు నిర్వహిస్తారు. ఒంటిపూట బడులతో పాటుగా వేసవి సెలవుల పైన స్పష్టత వచ్చింది. పదో తరగతి పరీక్షలకు కేంద్రాలున్న పాఠశాలల్లో మాత్రం మధ్యాహ్నం నుంచి పూట బడులను నిర్వహిస్తారని విద్యాశాఖ పేర్కొంది. ఈ స్కూళ్లలో ముందుగా మధ్యాహ్నం భోజనం అందజేసి.. ఆ తర్వాత తరగతులు కొనసాగించనున్నారు. 10వ తరగతి పరీక్షలు ముగిసిన తర్వాత.. యథావిధిగా ఉదయం పూట తరగతులు నిర్వహించాలని విద్యా శాఖ అన్ని పాఠశాలలకు అదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఏప్రిల్ 24న ప్రస్తుత విద్యా సంవత్సరానికి చివరి పని దినంగా పేర్కొన్నారు. ఏప్రిల్ 25 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించనున్నారు. తిరిగి 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలు జూన్ 12న ప్రారంభం కానున్నాయి. వేసవి సెలవుల పైన ప్రభుత్వం అధికారికంగా ప్రకటన చేయనుంది. గతం కంటే ఈ సారి వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో, ప్రభుత్వం పాఠశాలల్లో ఒంటిపూట బడుల నిర్వహణ పైన నిర్ణయం ప్రకటించింది.

### కౌలు రైతులకు రైతు బంధు!

-మొదటి పేజి తరువాయి

చేయాలని సీఎం చెప్పారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతు భరోసా పథకం తీసుకొస్తామని హామీ ఇచ్చింది. ఈ పథకం కింద సంవత్సరానికి ఎకరానికి రూ.15 వేలు అందించనున్నారు. అంతే కాదు కౌలు రైతులు కూడా సాయం చేయనున్నారు. రైతు కూలీలకు కూడా సాయం చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే వానకాలం నుంచి రైతు భరోసా పథకం అమలు చేసే అవకాశం కనిపిస్తోంది. ఇందుకోసం ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. అయితే ఆర్థికంగా ఉన్నవారికి రైతు భరోసా అవసరం లేదని చాలా మంది చెబుతున్నారు. ఇప్పటి వరకు సినీ నటులుకు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయం పన్ను చెల్లించేవారికి రైతు బంధు వచ్చేది. వీరికి రైతు భరోసా నిలిపివేయాలని డిమాండ్ ఉంది.ల రైతు భరోసా ఐదు నుంచి పదేకరాల లోపు ఉన్నవారికే ఇచ్చే అవకాశం ఉంది. గతేడాది వానాకాలంలో 68.99 లక్షల మందికి రైతుబంధు సాయం అందింది. వీరిలో ఎకరాలోపు భూమి ఉన్న రైతులే అత్యధికంగా 22.55 లక్షల మంది ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఎకరా నుంచి రెండెకరాల వరకు భూమి ఉన్న రైతుల సంఖ్య 16.98 లక్షలుగా ఉంది. ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతుల సంఖ్య 62.34 లక్షలుకాగా.. వీరందరికీ కలిపి సుమారు కోటి ఎకరాల భూమి ఉంది.

### అతికొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత

-మొదటి పేజి తరువాయి



అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు దిశానిర్దేశం చేశారు. ఇద్దరు ఎంపీ అభ్యర్థులను బీఆర్ఎస్ దాదాపు ఖరారు చేసింది. కరీంనగర్ నుంచి బోయినపల్లి వినోద్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్‌ను అభ్యర్థులుగా ఎంపిక చేసినట్లు సమాచారం. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష చేపట్టారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లా నేతలతో కూడా కేసీఆర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థులను ఎంపిక చేశారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలువబోతున్నదని ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలతో చర్చించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 12న సెంటిమెంట్‌గా వస్తున్న ఎస్సారార్ కాలేజీ గ్రౌండ్స్‌లో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ గెలువబోతుందన్నారు. అతికొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందన్నారు. రైతులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందన్న ఆయన.. బీఆర్ఎస్‌తో మేలు జరుగుతుందనే చర్చ మొదలైందన్నారు. శాసన సభ ఎన్నికల ఫలితాలు పట్టించుకోవద్దని శ్రేణులకు సూచించారు.

## సంపాదకీయం

# గాలిలో ఆరోగ్య భద్రత

తినే తిండి, పీల్చేగాలి, తాగే నీరు సురక్షితంగా, నాణ్యంగా, ఆరోగ్యకరంగా ఉండాలని కోరుకోనివారుండరు. మనిషికి కనీస అవసరాలైన ఇందులోని ఏఒక్కటి కల్తీ అయినా అది ప్రాణాలకే ప్రమాదం..ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న నిత్యావసర వస్తువులను కృత్రిమంగా తయారు చేసి.. కల్తీని ప్రజలకు విక్రయిస్తున్నారు. మరోపక్క నగరంలోని హోటళ్లలో కూడా కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు. కల్తీ ఆహారపదార్థాల బారిన పడి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా.. అధికార యంత్రాంగం నిద్ర మత్తులో ఉన్నదని విమర్శలొస్తున్నాయి. నకిలీ కొబ్బరి నూనె, మసాల, కిరాణా సరకులకు సంబంధించిన గుట్టును రట్టు చేశారు. కానీ, స్వార్థమే పరమావధి, లాభాలే అసలైన లక్ష్యంగా మారిన సమాజంలో సర్వం కల్తీమయం చేస్తున్నారు కొందరు ప్రబుద్ధులు. ఆహారపదార్థాల్లో ఉపయోగించే మాసాల దినుసుల్లోని గసగసాలు, మిర్యాలు, లవంగాలు, డ్రైఫ్రూట్స్, పిండి, బియ్యం.. అన్ని రకాల వస్తువులు నకిలీవి చేస్తున్నారు.మానవాళికే ప్రమాదకరంగా మారిన ఈ కల్తీని సమర్థవంతంగా నిరోధించి, కల్తీసురుల ఆటకట్టించే చట్టాలే కరువయ్యాయి. కోటికి పైగా జనాభా వున్న హైదరాబాద్‌లో గడిచిన రోజు ఓ అంతర్జాతీయ ప్రముఖ కంపెనీ చాక్లెట్‌లో తెల్లపురుగు వుందని నాచారంలోని రాష్ట్ర ఆహార ప్రయోగశాల నిర్ధారించడం, బేగంబజార్ కేంద్రంగా రూ. 5 లక్షలు విలువ చేసే అల్లం, వెల్లుల్లి కల్తీ పేస్టు ముఠాను పట్టుకోవడం సర్వం కల్తీమయాన్ని నిరూపిస్తున్నది.నేషనల్ క్రైమ్స్ బ్యూరో ఇటీవల 19 నగరాల్లో ఆహార నాణ్యతపై తనిఖీలు చేయగా హైదరాబాద్ దేశంలోనే 246 కేసులతో అగ్రస్థానంలో నిలిచిందని, ఇది దేశ వ్యాప్త కేసుల్లో 84 శాతమని బ్యూరో గణాంకాలతో సహా ప్రకటించడం ఆరోగ్యరంగ నిపుణులను ఆందోళనపరుస్తోంది. ఇంటి బయట ఏది తినాలన్నా కల్తీ భయం సాధారణ ప్రజలను తీవ్రంగా కలవరపరుస్తున్నది. అత్యధిక జనసాంద్రత, వేలాది హోటళ్ళున్న హైదరాబాద్‌లో ఆహార కల్తీని నిరోధించే అధికారులు కేవలం 30 మంది మాత్రమే ఉన్నారంటే నియంత్రణ పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సర్వం కల్తీతో పాలితులు కల్తీ ఆహారం తిని కడుపు సంబంధిత వ్యాధులు, కేన్సర్, డయాబెటిస్, గుండె వైఫల్యం, పెరాలసిస్ వంటి సుదీర్ఘ జబ్బులతో బాధితులుగా మారినా పాలకుల్లో ఆహార కల్తీ నియంత్రణపై చీమకుట్టినట్లయిన లేకపోవడం, అధికారులు మౌన ప్రేక్షకుల్లా మూగనోము పాటించడం క్షమించరాని నేరమే. 2006లోనే ఆహార భద్రత, ప్రమాణాల చట్టం తీసుకు వచ్చినా అది కాగితాలకే పరిమితమైంది. వీధి ఆహార దుకాణాల నుంచి ఫైవ్ స్టార్ హోటళ్ళ దాకా కల్తీసురులు చట్టంపై భయంలేక విశృంఖలంగా వీరవిహారం చేస్తున్నారు.సహజ సిద్ధంగా పొలాల్లో పండిన పంటల నుంచి వచ్చే ఆహార పదార్థాలను తినడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. అయితే, ఈ సహజ సిద్ధంగా పండే పంటల నుంచి వచ్చే ఆహారపదార్థాలు కాకుండా.. కొందరు కృత్రిమంగానే తయారు చేస్తున్నారు. ఇందుకు కొన్ని కెమికల్స్‌ను ఉపయోగిస్తున్నారు, హైడ్రోజన్ ఫెరాక్సైడ్ వంటి కెమికల్స్‌ను కలిపి.. ఈ నకిలీ వస్తువులు తయారు చేస్తున్నారు. జిలకర్ర, సాజిర, బాదం, లవంగాలు, ఇలాచీలు, గసగసాలు, మిర్యాలు, కర్రం పొడి, పసుపు, గోదుమ పిండి, నూడిల్స్.. ఇలా ఒకటేమిటి ఇంటిలోని వంట గదిలో ఉండే ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించే వస్తువులన్నీ నకిలీవి తయారు చేస్తున్నారు. మేమున్నామంటూ.. అప్పడప్పుడు పోలీసులు దాడులు చేస్తుంటారు. ఏడాదికోసారి ఫుడ్‌సేఫ్టీ అధికారులు కూడా.. మేం సైతం.. అంటూ దాడులు చేస్తుంటారు. పూర్తిస్థాయిలో మాత్రం అటు పోలీసులు, ఇటు ఫుడ్‌సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలున్నాయి. రాజస్థాన్, గుజరాత్ నుంచి వచ్చిన వాళ్లే కృత్రిమంగా నకిలీ పదార్థాలు తయారు చేస్తూ.. విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్టు తయారీకి వాడిన నాసిరకం ముడిపదార్థాలు, వాటికి రంగు, రుచి, వాసన రావడానికి వాడిన కెమికల్స్, అవి తయారైన పరిసరాల పరిశుభ్రతను పరిశీలిస్తే ఒళు గగుర్పొడుస్తోంది. కల్తీ తయారీదారులు అల్లం, వెల్లుల్లి పేస్టును బ్రాండ్ల పేరు, ఐఎస్ఐ ముద్రతోనే రాష్ట్ర వ్యాప్తంగా పేరున్న స్టోర్లకు కూడా పంపిణీ చేస్తున్నారని పోలీసులు చేసిన ప్రకటన చూస్తే వణికిపోని వారుండరంటే అతిశయోక్తి కాదు. పాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, వెన్న, మయోనీజ్, సాస్, కోవా, బియ్యం, చాక్లెట్లు లాంటి నిత్యావసర వస్తువుల నాణ్యతపై హైదరాబాద్ నగర పాలక సంస్థ ఆహార కల్తీ నిరోధక విభాగానికి ప్రతి రోజూ వందలాది ఫిర్యాదులు అందుతున్నాయంటే కల్తీ తీవ్రత ఎంతగా విస్తృతమవుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఆహార కల్తీని కూడా విధాన నిర్ణేతలు ప్రాధాన్యతా అంశంగా తీసుకొని వివిధ దేశాల్లో ఆదర్శప్రాయంగా వున్న చట్టాలను అక్కడి మాదిరిగా సంస్కరించి కఠిన శిక్షలు కల్తీసురులకు పడే విధంగా చూస్తే తప్ప కల్తీల ఆగడాలు ఆగవు.ఆహార కల్తీ చట్టం, అందులో భాగంగా ఏర్పాటైన యంత్రాంగాలు వీధివీధినా పెరిగిన ఆహార కేంద్రాలను ఎప్పటికప్పుడు నిఘా పెట్టి తనిఖీ చేసే పరిస్థితులు లేవు. పాలకులే మేల్కొని ఆహార కల్తీ నిరోధాన్ని అత్యవసరంగా తీసుకొని అందుకు తగిన కఠిన కార్యాచరణ అవలంబిస్తే తప్ప కల్తీ మహమ్మారిని పారద్రోలలేము. ఇప్పుడు సరైన యంత్రాంగం లేక అక్కడక్కడా, అప్పుడప్పుడూ ఆహార కల్తీ నిరోధక అధికారులు చేసే తనిఖీలు, పెట్టే కేసులు తూతూ మంత్రంగానే వున్నాయి. ఎక్కడా కేసులు పెట్టకపోవడం, పెట్టినా శిక్షలు నామమాత్రంగా కూడా లేకపోడవడంతో కల్తీ అనేది కుటీర పరిశ్రమగా మారింది. లాభమే తప్ప మనిషి ఆయుష్షుని పట్టించుకోని పరిస్థితి సర్వత్రా నెలకొన్నది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇంటి బయట ఉత్పత్తి అయ్యే ప్రతి పదార్థం లోని వాటిని ముడి పదార్థాలు, వాటి వల్ల ఆరోగ్యానికి సంభవించే లాభనష్టాలు లాంటివి పకడ్బందీగా ప్యాకింగ్‌లోనే ముద్రిస్తారు. ఆహార చట్టాల ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించి శిక్షలు కూడా త్వరిత గతిన పడేలా యంత్రాంగాలను ఏర్పాటు చేశారు. దీనితో అక్కడ కల్తీకి కొంత ముకుతాడు పడింది. కాని ఆ చిత్తశుద్ధి ఇక్కడ లేకపోడం ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారింది.

# కార్పొరేట్ విద్యకు కట్టడి ఎలా?




విద్యా సంస్థల ఫీజులు, డొనేషన్ల దోపిడీకి అంతు లేకుండా పోతున్నది. కార్పొరేట్ ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల కట్టడిపై ప్రభుత్వం మాట కూడా ఎత్తడం లేదు. దీంతో ఫీజులు మళ్లీ ఎలా పెంచుతారో అంటూ పేరెంట్స్ ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో 10,700 వరకు కార్పొరేట్ ప్రైవేటు స్కూల్స్ ఉండగా, వీటిలో 32 లక్షల మంది చదువుతున్నారు. బడ్జెట్ ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు కొంత తక్కువగానే ఉండగా మిగిలిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో మాత్రం భారీగానే వసూలు చేస్తున్నారు. ఒక్కో స్కూల్లో క్లాసును బట్టి రూ. 50 వేల నుంచి రూ. 5 లక్షల వరకు యాజమాన్యం ఫీజులు వసూలు చేస్తున్నది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు బడులు విద్యార్థుల చదువును సంతలో సరుకుగా మార్చేశాయి. స్కూళ్ళు ప్రారంభం కానున్నాయి, దోపిడీ మొదలైంది. అడ్మిషన్ తీసుకోవాలంటే డొనేషన్లని, బుక్స్‌కు సపరేట్ అని, యూనిఫామ్‌కు సపరేట్ అని, ఐఐటి ఫౌండేషన్ అయితే సపరేట్, బస్సు ఫీజు సపరేటు అని ఇలా రకరకాల పేర్లతో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారు పాఠశాలల యాజమాన్యాలు. తమ పిల్లలను ఉన్నతమైన, నాణ్యమైన చదువులను చదివించాలని తల్లిదండ్రుల కార్పొరేట్ మోజులో పడి ప్రైవేట్ విద్యా సంస్థలకు కాసుల వసూళ్లకు అవకాశంగా మారింది. ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి అక్రమ వసూళ్లకు తెర తీశారు. పట్టణాల్లో చదవాలంటే హాస్టలు వసతి కూడా వారికి అవసరమవుతుంది. దీంతో స్కూలు, హాస్టల్ పేరుతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రూ. 30 వేల నుంచి రూ. 50 వేల వరకు, ఆ తర్వాత విద్యార్థులకు పాఠశాలను బట్టి రూ. 60 వేల నుంచి సుమారు లక్ష రూపాయల వరకు వసూలు చేస్తున్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలకు తాము తక్కువ కాదంటూ కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ఇదే సంప్రదాయానికి దిగాయి. సాధారణ చదువులతో ఐఐటి ఫౌండేషన్ అంటూ మరి కొంత నొక్కుతున్నాయి. దీంతో విద్యార్థులను స్కూళ్లలో చేర్పించేందుకు వచ్చి, వెనక్కి వెళ్ళలేక చేర్పించే సాహసం చేయలేక తలిదండ్రులు తలలు పట్టుకుంటున్నారు. నేడు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ, దోపిడీ చేస్తూ అక్షరాలను వ్యాపారంగా కొనసాగిస్తున్నాయి. ప్రధానంగా కార్పొరేట్, సెమీ కార్పొరేట్ తరహా పాఠశాలలను నిర్వహిస్తున్న యాజమాన్యాల దోపిడీకి అడ్డుఅదుపు లేకుండాపోయింది. వీటిని నిరోధించాల్సిన అవసరం విద్యాశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో విచ్చలవిడిగా నిబంధనలు పాతరవేస్తున్నారు.ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు చైతన్యమై ప్రభుత్వ నిబంధనలు, విద్యాహక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిబంధనలు కనుక చూసినట్లయితే సెక్షన్- 6 ప్రభుత్వ నిబంధనల ప్రకారం అడ్మిషన్లు జరగాలి. సెక్షన్ -11 ప్రైవేటు యాజమాన్యాలు గవర్నింగ్ బాడీ నిర్ణయించే ఫీజు కంటే ఎక్కువ వసూలు చేయకూడదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. సెక్షన్ 1, 2 ప్రకారం స్కూల్ స్టాఫ్ సెలక్షన్ కమిటీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం టీచర్లను, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించి వారి వివరాలు, విద్యార్హత, వారికి ఇచ్చే వేతనాల వివరాలను నోటీస్ బోర్డ్‌లో పెట్టాలని చట్టం చెబుతుంది. సెక్షన్ -12 ప్రకారం టీచర్, విద్యార్థుల నిష్పత్తి 1:20 కి మించరాదు.

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు యాజమాన్యం 25% సీట్లను ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులకు, మైనారిటీలకు కేటాయించాలి. పాఠశాల యాజమాన్యాలు నోట్ బుక్స్, యూనిఫారాలు, స్కూల్ బ్యాగులు, ఇతర స్టేషనరీని అమ్మరాదు. ఎక్కడ కొనుగోలు చేయాలో కూడా సూచించరాదు.డి.ఎడ్ లేదా బి.ఇడి అర్హత ఉండాలి. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల టీచర్లు డిఎడ్ లేదా బిఇడి అర్హత ఉండి టెట్‌లో అర్హత సాధించి ఉండాలి. విద్యార్థుల ఫీజు వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచాలి. జివో నెంబర్ 42 ప్రకారం డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజులు వసూలు చేయరాదు. ఆట స్థలం తప్పనిసరిగా ఉండాలి. మున్సిపాలిటీ పరిధిలో పాఠశాలల్లో 1000 చదరపు మీటర్లు. గ్రామీణ ఇతర ప్రాంతాల్లో 2000 చదరపు మీటర్ల ఆటస్థలం తప్పనిసరిగా ఉండాలి. పాఠశాల పక్కా భవనంలో నిర్వహించాలి. ప్రతి పాఠశాలలో సలహాలు, సూచనలకు ఫిర్యాదు బాక్సులు ఉండాలి. ఫీజు స్లిప్పులను చిన్నారుల చేతికి రాసిఇస్తే జరిమానా ఉంటుంది. అభం శు భం తెలియని చిన్నారుల చేతికి స్కూల్ ఫీజుల రసీదులు ఇస్తున్నారు పాఠశాల యాజమాన్యం. మీ అమ్మనాన్న ఇంకా ఫీజు చెల్లించలేదంటూ వారిని కించపరుస్తున్నారు. గతంలో చిన్నారి చేతికి రసీదు ఇచ్చిన ఓ ప్రైవేట్ స్కూలుకు చెందిన యాజమాన్యానికి భారీ ఎత్తున జరిమానా విధించింది విద్యాశాఖ. అనుమతులు లేకుండా స్కూళ్లను ప్రారంభించకూడదు.

ప్రభుత్వ అనుమతితోనే ప్రారంభించాలి. ఆరు నెలల్లోపు అనుమతులు పొందాలి. ప్రభుత్వ సూచనల ప్రకారం ఫీజులు తీసుకోవాలి. 20 మంది చిన్నారులకు ఒక ఉపాధ్యాయుడు, ఒక సంరక్షకుడు ఉండాలి. రక్షణ, భద్రతా, పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. భవనానికి ప్రహరీ ఉండి, గాలి వెలుతురు బాగా వచ్చేలా ఉండాలి. చిన్నారులు నిద్రపోవడానికి ప్రత్యేకంగా విశ్రాంతి గది ఉండాలి. మరుగుదొడ్లు, స్నానాల గదిలో టవలు, సబ్బులు ఉంచి, పరిశుభ్రత చర్యలు పాటించాలి. ప్లే స్కూల్‌కు తప్పనిసరిగా ప్లే స్కూల్ అని బోర్డు పెట్టాలి. ప్రవేశాలు పూర్తయిన తర్వాత తల్లిదండ్రుల కమిటీని నెలలోపు నియమించాలి. ఇందులో 50% తల్లులు, 25% ఉపాధ్యాయులు, 25% తండ్రులు ఉండేలా చూడాలి. ఈ కమిటీని ఏటా మారుస్తుండాలి. ప్రతి నెల సమావేశం ఏర్పాటు చేసి ఆ వివరాలను నమోదు చేయాలి. పిల్లలకు జంక్‌ఫుడ్‌ను అనుమతించకూడదు. పోషకాలతో కూడిన ఆహారాన్ని మాత్రమే ఇవ్వాలి. ఇటువంటి నిబంధనలు చాలా స్కూళ్లు పాటించకుండా నడుపుతా ఉన్నాయి.

కొన్ని స్కూళ్లలో ఎల్‌కెజికి రూ. 1,20,000 వసూలు చేస్తున్నారని పేరెంట్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగో తరగతికి రూ. 1,20,000 నుంచి రూ. 1,60,000కు పెంచారని చెబుతున్నారు. ఫీజులు ఇష్టం వచ్చినట్లు పెంచుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనికి కూడా ఒక ప్రత్యేక కమిటీని నియమించి, రాష్ట్ర ప్రభుత్వం పలానా తరగతికి ఫలానా అమౌంట్ తీసుకోవాలని సూచించాలి. దాని ప్రకారమే ప్రైవేటు పాఠశాలలు ఫీజులు తీసుకోవాలి. అలా చేసినట్లయితే ప్రైవేటు పాఠశాల నుండి కొంత ఉపశమనం లభిస్తుందని పిల్లల తల్లిదండ్రులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రతి జిల్లాకు జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో కమిటీని ఏర్పాటు చేసి, ఫీజులను నియంత్రించే ఆలోచన చేయాలి. అధిక ఫీజులు వసూలు చేస్తున్నటువంటి ప్రైవేటు పాఠశాలల పైన కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే పాఠశాలల గుర్తింపును రద్దు చేసే విధంగా చర్యలు చేపట్టాలి. అప్పుడే ఫీజుల నియంత్రణ ప్రభుత్వ ఆధీనంలో ఉంటుంది అంటున్నారు విశ్లేషకులు. ఆ దిశగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని ఆశిద్దాం.

# కొరవడిన వన్యప్రాణుల సంరక్షణ

ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం, ప్రతి సంవత్సరం మార్చి 3న నిర్వహించ బడుతోంది. అంతరించి పోతున్న అడవి జాతుల సంరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ దినోత్సవం జరుపు కుంటారు. 2013, మార్చి 3 నుండి 14 వరకు బ్యాంకాక్‌లో జరిగిన జనరల్ అసెంబ్లీ16వ సమా వేశంలో ప్రపంచ అడవి జంతుజాలం, వృక్షజాలం గురించి వేడుకలు జరుపుకునేందుకు, అవగాహన పెంచడానికి మార్చి 3 ను ప్రపంచ వన్యప్రాణి దినోత్స వంగా పేర్కొనడం జరిగింది.2013, డిసెంబరు 20న జరిగిన ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ దాని 68వ సెషన్ తీర్మానంలో, మార్చి 3న ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవాన్ని ప్రకటించింది. వన్యప్రాణుల అంతర్గత విలువను, పర్యావరణ, జన్యు, సామాజిక, ఆర్థిక, శాస్త్రీయ, విద్యా, సాంస్కృతిక, వినోద అభివృద్ధికి, మానవ శ్రేయస్సు కోసం వివిధ కార్యక్రమాలు చేయాలని తీర్మానించింది. వాస్తవానికి మనిషి కంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ చెబుతోంది. అయితే భూమి ఆవిర్భవించిన తరవాత పుట్టిన చాలా జంతు జాతులు ఇప్పుడు లేవు. ఈ ఆధునిక యుగంలోనూ మనకు తెలిసిన ఎన్నో జంతు జాతులు కనుమరుగై పోతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థక మవుతున్న నేపథ్యంలో.. వాటి సంరక్షణ ప్రాధాన్యతను గుర్తుచేస్తూ ప్రతీ ఏటా అన్ని దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపు తున్నాయి.



వన్య ప్రాణుల సంరక్షణ కోసం మన ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయితే స్మగ్లర్లు, వేటగాళు .. వన్యప్రాణులు, అరణ్యా ల పాలిట శాపంలా తయారయ్యారు. వీళ్ల దెబ్బకు కీకరారణ్యాలు సైతం మైదానాలుగా మారుతున్న పరిస్థితి. పరిశ్రమల స్థాపన పేరిట పెద్ద ఎత్తున అటవీ భూముల్లో పారిశ్రామిక కార్యకలా పాలు నిర్వహిస్తుం డటం కూడా వన్యప్రాణుల మనుగడుకు ముప్పుగా మారింది. దీంతో గూడు చెదిరిన వన్యప్రాణుల జనారణ్యం లోకి వస్తున్న పరిస్థితి. దేశంలోని జంతు సంపదను పరిరక్షించ డానికి మొట్టమొదటి సారిగా 1898లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మొదటి పక్షుల అభయారణ్యాన్ని తమిళనాడు లోని వేదాంతం గల్‌లో ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 1935లో మొదటి వన్య ప్రాణి జాతీయ పార్కు 'హేలీ'ని ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేశారు. ఇదే పార్కును ఇప్పుడు జిమ్ కార్బెట్ పార్కు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మొత్తం జాతీయ పార్కుల సంఖ్య 102. 1976లో జరిగిన రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 51(ఎ) ప్రకారం వన్యప్రాణి సంరక్షణ పౌరుల ప్రాథమిక విధి. ఆదేశిక సూత్రాల్లో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా వన్యప్రాణులను సంరక్షించాలని పేర్కొన్నారు. భారత దేశంలో వన్యప్రాణి సంరక్షణ కోసం 1972లో చట్టం ఆనాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టారు.

ఈ చట్టం ప్రకారం వన్య ప్రాణుల వేట నిషేధం. ఈ చట్టం అమలులోకి వచ్చాక.. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 23 టైగర్ ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలో 441వన్య ప్రాణి సంరక్షణ కేంద్రాలు ఉండగా.. వీటిల్లో 28 టైగర్ జోన్స్ ఉన్నాయి. అంతర్జాతీ యంగా పులి చర్మానికి, గోళ్లకు, ఎముకలకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో.. వేటగాళ్ల చేతిలో చిరుతల బలైపో తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశవ్యాప్తంగా ఉన్న అడవుల్లో దాదాపు నలభై వేలకు పైగా ఉన్న పులులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కానీ 1972 నాటికే ఆ సంఖ్య మూడు వేలకు పడిపోయిం దంటే.. అప్పటి ప్రభుత్వాలు ఎంతటి నిర్లక్ష్య వైఖరి అవలంభించాయో స్పష్టంగా అర్థమవుతోంది. సాధారణంగా పులుల జనాభాను లెక్కించేందుకు ఇంతకు ముందు పాదముద్రలను గుర్తించడం ఒక్కటే మార్గం. అవి సంచరించే ప్రాంతాల్లో రహస్య కెమెరాలను ఏర్పాటు చేసి.. వాటి పాదముద్రలను సేకరించేవారు. అయితే ఇది చాలా కష్టంతో కూడు కున్న పని. కచ్చితమైన లెక్కకు ఆస్కారం కూడా తక్కువే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలార్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) పులుల మలం ద్వారా వాటిని లెక్కించే పద్ధతిని ఆవిష్కరించింది. 20వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు లక్ష పైచిలుకు పులులు ఉండేవి అని అంచనా.

2014 లెక్కల ప్రకారం ప్రపంచంలో 3891 పులులు ఉండగా వాటిలో 2226 మన దేశంలోనే ఉన్నాయి. భారత్‌లో 2011 లెక్కల ప్రకారం 1706, 2014 ప్రకారం 2226 ఉండగా 2018 పులుల గణన ప్రకారం మన దేశంలో 2967 పులులున్నాయి. ప్రపంచంలో ఉన్న మొత్తం పులుల్లో 70శాతం పైగా మనదేశం లోనే ఉన్నాయి. గడిచిన కొన్నేళ్లలో ఒక్క మధ్య ప్రదేశ్‌లోనే 19 పులులు మృత్యువాత పడ్డాయి. మహారాష్ట్రలో 9, ఉత్తరాఖండ్‌లో 9 మృత్యువాత పడ్డాయి. 2016లో దేశవ్యాప్తంగా74 పులులు మరణించినట్టు లెక్కలు చెబుతున్నాయి. 2006లో పులులను స్మగ్లర్ల బారి నుండి కాపాడ టానికి టైగర్ టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశారు. భారత దేశంలో పశ్చిమ కనుమలు, నల్లమల కొండలు, శేషాచలం కొండలు, హిమాలయాలు, దేశ ఈశాన్యప్రాంతం విభిన్న జంతు జీవ జాలానికి నిలయంగా ఉన్నాయి. దేశంలో అడవులు అన్యాక్రాంత మవుతున్నాయి. ఒకప్పుడు విశాలంగా ఎక్కడ చూసినా పచ్చదనంతో బాసిల్లే అటవీ ప్రాంతాలు రాను రాను కనుమరుగై పోతున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట యధేచ్ఛగా జరుగుతుంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం.

విచక్షణా రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం. అందుకే అడవి జంతువులు గ్రామాలలోకి, పట్టణాల్లోకి వస్తున్నాయి. ఆహారం కోసం మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిని మార్చడం కూడా ఈ జంతు దినోత్సవం లక్ష్యాల్లో ఒకటి. జంతువులకు సహజ సిద్ధమైన ఆవాసాలను కల్పించడం, జంతు జాతులను రక్షించడం, వాటి సంక్షేమాన్ని కాపాడటం ఇవే ప్రధానం. మానవుడికి, జంతువులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ దినోత్సవం తెలియ జేస్తుంది. ఈ రోజున జంతు సంక్షేమ ప్రచారాలతో పాటు జంతు పరిరక్షక శిబిరాలను ప్రారంభించడం, జంతు సంరక్షణకు నిధులు సేకరించడం వంటి కార్యక్ర మాలు నిర్వహిస్తారు.

# స్థానిక వార్తలు

# నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు






**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** నియోజకవర్గంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయంలో కాంగ్రెస్ నేత బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అంతిరెడ్డి అనిల్ కుమార్ రెడ్డి పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు పోలియో బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యగ రెండు పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు సంజీవనీలా పనిచేస్తాయని పోలియో రహిత సమాజాన్ని కలిసికట్టుగా నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు. చిన్నారులకు పోలియో చుక్కలు ఆయన వేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీపీ రవీందర్ గౌడ్..**

పటాన్చెరు నియోజకవర్గంలోని జిన్నారం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ రవీందర్ గౌడ్, జిన్నారం ఎంపీటీసీ లావణ్య నరేష్ వైద్య సిబ్బందితో కలిసి పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. పుట్టిన పసి పిల్లల నుండి ఐదు సంవత్సరాలలోపు ఉన్న పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించుకోవాలని అన్నారు. చిన్న పిల్లలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా ఆరోగ్యంగా ఉండడానికి పల్స్ పోలియో చుక్కలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు కోమలి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు యనగండ్ల నరేందర్, మండల కాంగ్రెస్ నాయకులు పల్నాటి భాస్కర్, బాల్ రాజ్, శివతేజ, నరేష్ చారి, రొయ్యపల్లి రవి, ఎరవలి ప్రవీణ్, బాల్ రెడ్డి, కోరబోయిన పోశయ్య, ఎరవలి బాలు, కోరబోయిన దుర్గయ్య, సాయిలు, అశోక్, స్వామి, భాస్కర్, సాయి రెడ్డి, శివ, వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టిసారించింది

**వాస్తవ నేస్తం,బోనకల్:** మండలంలో జరుగుతున్న ధరణి సమస్యల డ్రైవ్ కార్యక్రమాన్ని ఆర్డిఓ గణేష్ పర్యవేక్షించారు. మండల వ్యాప్తంగా 22 గ్రామాల్లో గల ఎన్ని సమస్యలు పెండింగ్ లో ఉన్నాయో తెలుసుకున్నారు. ధరణి సమస్యలు ఎలా పరిష్కరించాలో తెలియపరిచారు. ఈనెల 9లోగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి, మండలాల వారీగా దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల వ్యాప్తంగా గ్రామాలకు మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు తహసిల్దార్ పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్‌లలో ప్రతి దరఖాస్తును పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఒక దరఖాస్తును ఆమోదించినా తిరస్కరించినా అందుకు కారణాలను సంభందిత అధికారులు స్పష్టం చేయాలని అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం కాలయాపన లేకుండా ఏడు రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

## నేడు ప్రెస్ క్లబ్ కార్యాలయం ప్రారంభోత్సవం

**హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని విక్రమార్**



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల కేంద్రంలో డిసిసిబి బ్యాంక్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేయబడిన ప్రెస్ క్లబ్ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి పాల్గొన నున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దేగల వేలాద్రి, కార్యవర్గ సభ్యులు తెలిపారు. మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రులు ప్రతి ఒక్కరు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**వాస్తవ నేస్తం,బాల్కొండ:** మండలంలోని కిసాన్ నగర్ గ్రామంలో ఆదివారం ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల 1997-1998 వ పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి గుర్తులను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. తమ తోటి మిత్రులకు ఏదైనా ఆపద వస్తే అండగా నిలుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి దీపా దాస్ మున్షీ కలిసిన నీలం మధు



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి దీపా దాస్ మున్షీని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్లోని వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా రానున్న మెదక్ పార్లమెంటు ఎలక్షన్లో పార్టీ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ మెదక్ పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని సూచించారు. నీలం మధు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కంకణ బద్ధుడినై పని చేస్తూ మెదక్ పార్లమెంటు లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు.

## పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు



**వాస్తవ నేస్తం,బజార్హత్నూర్:** మండలంలోని భుతాయి(బి) గ్రామపంచాయతీ పరిధిలో మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు ఫడ్ జ్ఞానేశ్వర్ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నపిల్లల ఆరోగ్యవంతమైన జీవితానికి రెండు చుక్కలు పోయు వేయించడం చాలా ముఖ్యమన్నారు. చిన్నపిల్లల నిండు జీవితానికి రెండు చుక్కల పోలియో వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త కవిత, ఆశా వర్కర్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యత

**- ఎండిఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ పృథ్వీరాజ్**

**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** ప్రపంచంలోని వివిధ దేశాలలో ఎన్నో అరుదైన పక్షి, జంతు జాతులు అంతరించిపోతున్నాయి. ఇప్పటికే చాలా జీవులు కనుమరుగైపోగా మిగతా వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. బయోడైవర్సిటీ, హెరిటేజ్ సైట్ గా గుర్తింపు పొందిన అమీన్పూర్ పెద్ద చెరువు మన జిల్లాలో ఉండడం చాలా సంతోషించాల్సిన విషయమని ఎండిఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ పృథ్వీరాజ్ అన్నారు. పటాన్ చెరు నియోజకవర్గం పరిధిలోని జిన్నారం, గుమ్మడిదల మండలాలను అనుకొని నర్సాపూర్ వరకు 15వేల ఎకరాల్లో అటవీ ప్రాంతం విస్తరించింది. ఇందులో బొంతపల్లి అర్బన్ ఫారెస్ట్ 4,343 ఎకరాల్లో వుంది. ఈ అటవీ ప్రాంతాన్ని సంరక్షించుకోవడం మనందరి బాధ్యత అని, దీని ద్వారా వన్య ప్రాణులను మనం కాపాడుకోవచ్చు అని, వాటి అవాసాలను పరిరక్షిస్తే అవి మనుగడ సాగించగలుగుతున్నామన్నారు. నేడు ప్రపంచ వన్యప్రాణి దినోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరూ వన్యప్రాణి సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు.





# పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల**

**వాస్తవ నేస్తం,కోదాడ:** పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని కోదాడ మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల రమేష్ అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అప్పుడే పుట్టిన పిల్లల నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసుకోవాలన్నారు. పోలియో రహిత లక్ష్యం సాధించి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మైస. రమేష్, మున్సిపల్ మేనేజర్ రాబిన్, శానిటరీ ఇన్ స్పెక్టర్ యాదగిరి,హెచ్ ఇ ఓ సురేంద్ర, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ శైలజ, ఆరోగ్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది ఆశా వర్కర్లు, మున్సిపల్ ఆర్ పి లు పాల్గొన్నారు.



# నిరుద్యోగులను బీజేపీ పార్టీ మోసం చేస్తోంది మోసం



**వాస్తవ నేస్తం,కోటగిరి:** మండల కేంద్రంలో ఆదివారం సిపిఐ పార్టీ ప్రెస్ మీట్ నిర్వహించారు. దీనిని ఉద్దేశించి సిపిఐ బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జ్ దుబాస్ రాములు, కోటగిరి మండల కార్యదర్శి విటల్ గౌడ్ లు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరుద్యోగులకు ఏడాదికి రెండు కోట్ల నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను దగా చేసిందని వారు విమర్శించారు. రైతాంగం పండించిన పంటకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంలో వైఫల్యం చెందిందని అన్నారు. గిట్టుబాటు ధర కొరకు దేశ రాజధాని ఢిల్లీలో రైతులు ఉద్యమాలు నిర్వహిస్తుంటే రైతులపై ఉక్కు పాదం మోపడం సరైనది కాదని, రైతులకు వ్యతిరేకంగా ఉన్న నల్ల చట్టాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ రంగాన్ని, బొగ్గు గనులను, బిఎస్ఎన్ఎల్, విమానం రంగాలను, భారతదేశ ఆస్తులను ప్రవేట్ పరం చేయడం, కార్పొరేట్ వ్యక్తులకు దార దత్తం చేయడంలో బీజేపీ దిట్ట అని వారు విమర్శించారు. ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీజేపీ హటావో, దేశ్ కో బచావో నినాదంతో ఉద్యమాలకు కార్మిక వర్గం ప్రజలు రైతులు నిరుద్యోగులు సిద్ధం కావాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నల్ల గంగాధర్, బూడాల రాములు, హనుమాండ్లు, నగేష్, వీరేశం, మునీర్, పాషా, తదితరులు పాల్గొన్నారు.

## త్రిమూర్తి శివ జయంతి మహోత్సవ శాంతియాత్ర




**వాస్తవ నేస్తం,కోదాడ:** పట్టణంలోని బ్రహ్మకుమారి ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వజనుల సుఖశాంతుల కోసం శాంతి యాత్ర ర్యాలీని మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నం బాబు, ప్రగతి నాగేశ్వరరావు లు ప్రారంభించారు. ర్యాలీ రామ్మూర్తి నగర్ నుండి ప్రధాన రహదారుల గుండా సాగింది. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయాల సభ్యులందరూ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు..



**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** చిన్నపిల్లల నిండు జీవితానికి పోలియో చుక్కలు వేయించాలని సోషల్ వర్కర్ సత్యరాజ్ ఉపారపు అన్నారు. మండలంలోని లింగాపూర్ గ్రామంలో నిర్వహించిన పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. శిశివు అనారోగ్యంగా ఉన్నపటికీ పోలియో చుక్కలు వేసి పోలియో వ్యాధిని తరిమికొట్టి పోలియో పై విజయం సాధించడంలో దేశానికి తోడ్పాడాలని పిలుపు నిచ్చారు. పల్స్ పోలియో కార్యక్రమం మూడు రోజులు ఉంటుందని మొదటి రోజు గ్రామ పంచాయతీ కార్యాలయం లో అలాగే రెండవ రోజు, మూడవ రోజు ఇంటింటికి వెళ్లి వేస్తారు కాబట్టి పిల్లలకు టీకాలు వేయించి పోలియో పై నిరంతర విజయం సాధించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ అనసూయ, రాహుల్ తదితరులు ఉన్నారు

## రెండు చుక్కలు.. జీవితానికి ఒక మెట్టు



**వాస్తవనేస్త,సంగారెడ్డి:** సదాశివపేట మండలంలోని నాగసన్పల్లి గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ లక్ష్మీ చంద్రశేఖర్ ప్రారంభించారు. అప్పుడే పుట్టిన శిశువు నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో మహమ్మారి నుండి కాపాడుకోవడానికి, భవిష్యత్తులో వారు ఆరోగ్యంగా ఉండడానికి తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ బిడ్డలకు పల్స్ పోలియో వేయించి పోలియో రహిత సమాజం కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, రమేష్, హరీష్ గౌడ్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు భారీ షాక్..

## ఆ కీలక నేత పార్టీమారనున్నారా..?

**వరంగల్:** వరంగల్ జిల్లాలో గులాబీ పార్టీకి మరో భారీ షాక్ తలిగింది. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పార్టీకి, తన పదవికి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. పార్టీకి రాజీనామా చేసి బీజేపీలోకి వెళ్లేందుకు ఆయన సిద్ధమవు తున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం బీజేపీ అగ్ర నేతలు ఆయనను కలిసినట్లు సమాచారం. అయితే రమేష్ పార్టీ మారుతుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కేసీఆర్ పార్టీకి బిగ్ షాక్ తగిలినట్టే అవుతుందని రాజకీయ విశ్లేషకులు అభి ప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా తనకు పార్టీ లో సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదని అనుచరుల దగ్గర రమేష్ చెప్పి ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆయనతో పాటు అనుచరులు కూడా పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారు.



**బుజ్జగింపులు ఫలించేనా..?**

అయితే ఆరూరి రమేష్‌తో బీఆర్ఎస్ అగ్ర నేతలు బుజ్జగించేందుకు ప్రయత్నిస్తున్నారు. మొదట ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రమేష్‌ను బుజ్జగించే బాధ్యతలను అధిష్ఠానం అప్పగించింది. కానీ ఆయనని బుజ్జగించేందుకు కడియం అంగీకరించలేదు. దీంతో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను బీఆర్ఎస్ అధిష్ఠానం రంగంలోకి దించింది. ఆరూరి రమేష్‌ను పార్టీ మారకుండా బస్వరాజు బుజ్జగిస్తున్నారు. అయితే రమేష్ పార్టీ మారేందుకే సిద్ధమైనట్లు తెలుస్తోంది. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నుంచి వరంగల్ ఎంపీ స్థానానికి ఆయన పోటీకి దిగే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరేందుకు 15మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు సిద్ధమైన విషయం తెలిసిందే. రమేష్ కూడా పార్టీ మారుతుండటంతో వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ కకావికలం అవుతోంది. వలసలు ఇలాగే కొనసాగితే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గడ్డు పరిస్థితులు ఎదుర్కొనే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన మంత్రి దామోదర రాజనరసింహ



**సంగారెడ్డి :** ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసి పోలియోను నివారించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం జోగిపేట వంద పడకల ప్రభుత్వ దవాఖానలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రసూతి వార్డులో పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. పోలియో రహిత సమాజం కోసం కలిసికట్టుగా పోరాడుదామన్నారు. అనంతరం జోగిపేట ఏరియా దవాఖానలో ఎమర్జెన్సీ సౌకర్యం కోసం నూతన అంబులెన్స్‌ను అందజేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి గాయత్రి దేవి ఆర్డీఓ పాండు, సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# పెందుర్తిలో ట్రాయాంగిల్ ఫైట్ తప్పదా




**విశాఖపట్టణం :** ఉమ్మడి విశాఖ జిల్లాలోని మరో నియోజకవర్గం పెందుర్తి. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో 2.11,366 మంది ఓటర్లు ఉన్నారు. వీరుల పురుష ఓటర్లు 1,02,179 మంది కాగా, మహిళా ఓటర్లు 1,09,182 మంది ఉన్నారు. ఇప్పటి వరకు ఈ నియోజకవర్గంలో 13 సార్లు ఎన్నికలు జరగగా, నాలుగు సార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, నాలుగు సార్లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ఒకసారి ప్రజారాజ్యం పార్టీ, మరోసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎక్కడ విజయం సాధించారు. పెందుర్తి నియోజకవర్గంలో తొలిసారిగా 1967 లో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన జి బుచ్చి అప్పారావు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన అల్లు దశావతారంపై 5629 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 1972లో జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన ఏఎస్ఆర్ ఉప్పలపాటి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలోకి దిగిన బిఏ గొర్రెపాటిపై 7036 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1978లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన జి అప్పన్న విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి సిపిఎం నుంచి పోటీ చేసిన ఐ.ఎస్ గంగాధర రెడ్డిపై 10,047 ఓట్ల తేడాతో విజయం దక్కించుకున్నారు. 1980లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన డి సత్యనారాయణ తన సమీప కృతజ్ఞతలు ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన పి సింహాచలంపై 5527 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1983లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసిన పి అప్పల నరసింహంపై ఇక్కడ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన డి సత్యనారాయణపై 32,355 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 1985లో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేసిన ఏ రామచంద్రరావు ఇక్కడ విజయాన్ని సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన జి గురునాథరావుపై 9209 ఓట్ల తేడాతో విజయాన్ని నమోదు చేశారు. 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన జి గురునాథరావు ఇక్కడ విజయం దక్కించుకున్నారు. టిడిపి నుంచి పోటీ చేసిన పి సింహాచలంపై 13,903 ఓట్ల తేడాతో ఆయన విజయం సాధించారు. 1994లో జరిగిన ఎన్నికల్లో సిపిఐ నుంచి పోటీ చేసిన ఎం ఆంజనేయులు గెలుపొందారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన డి శ్రీనివాస్ పై 30,987 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 1999లో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేసిన పి గణబాబు ఇక్కడ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన డి శ్రీనివాస్ పై 23,589 ఓట్ల తేడాతో విజయాన్ని నమోదు చేశారు. 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన పి గురుమూర్తి రెడ్డి తన సమీప ప్రత్యర్థి టిడిపి నుంచి పోటీ చేసిన జి నాగమణిపై 18,150 ఓట్ల తేడాతో గెలుపొందారు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసిన పి రమేష్ బాబు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన తన సమీప ప్రత్యర్థి గండి బాబ్జి పై 3,272 ఓట్ల తేడాతో గెలుపొందారు. 2014 లో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి పోటీ చేసిన బండారు సత్యనారాయణమూర్తి తన సమీప ప్రత్యర్థి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన గండి బాబ్జి పై 18,648 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా బరిలోకి దిగిన అదీప్ రాజు అన్నపురెడ్డి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి టిడిపి నుంచి పోటీ చేసిన బండారు సత్యనారాయణమూర్తి పై 28 860 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడ పోటీ చేసేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి పలువురు అభ్యర్థులు పోటీపడుతున్నారు. అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్ రాజ్ మరోసారి పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తుండగా మరో ఇద్దరు నేతలు కూడా సీటు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి మరోసారి ఇక్కడ బరిలోకి దిగేందుకు సిద్ధపడుతున్నారు. జనసేన పార్టీ ఈ సీటును ఆశిస్తోంది. జనసేన పార్టీ నుంచి పంచకర్ల రమేష్ బాబు తీవ్రస్థాయిలో ప్రయత్నాలను సాగిస్తున్నారు. కూటమి అభ్యర్థిగా ఇక్కడ ఎవరు పోటీ చేస్తారన్న దానిపై ఆసక్తి నెలకొంది. చూడాలి 2024 ఎన్నికల్లో ఎక్కడ ఏ పార్టీ జెండా ఎగరబోతుందో.

## నగరంలో.. ఆరుగురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ.. 54మంది మల్టీజోన్‌కు..




**హైదరాబాద్ :** హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మరోసారి భారీ ప్రక్షాళన జరిగింది. ఆరుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయడంతో పాటు 54 మంది ఇన్‌స్పెక్టర్ల సేవలను మల్టీజోన్ -2కు సరెండర్ చేస్తూ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే కొత్త స్థానాల్లో చేరాలని, మల్టీజోన్‌కు మారిన అధికారులు తమ జోన్లలో రిపోర్ట్ చేయాలని స్పష్టం చేశారు. అయితే ఖాళీ అయిన స్థానాలన్నింటిలో భర్తీలకు మాత్రం ఆదేశాలు రాలేదు. దీంతో ట్రాన్స్‌ఫర్ అయిన స్థానాల్లో కొత్త అధికారులు వచ్చే అవకాశమున్నందున 1-2 రోజుల్లో మరిన్ని ట్రాన్స్‌ఫర్లు తప్పవని తెలుస్తోంది. బదిలీ అయిన ఆరుగురు అధికారుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు ఖలీల్‌పాష, పరశురామ్, ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణలు నలుగురు ఎస్‌బీకి, సౌత్‌ఈస్ట జోన్ మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ అనురాధ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు, రామ్‌గోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఐటీసెల్‌కు బదిలీ అయ్యారు.

## జీపీ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలి




**కొత్తూర్ :** గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని కోరుతూ శనివారం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ వేణుగోపాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నా.. జీపీ కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కార్మికులకు బీమాతో పాటు గుర్తింపుకార్డులు, కనీస వేతనాలు అందజేయాలన్నారు. ఏఐటీయూసీ నాయకుడు మామిడి శేఖర్‌రెడ్డి, నాయకులు మైసయ్య, రాములు, భిక్షపతి, సురేష్, సాయిలు, యాదగిరి తదితరులున్నారు.

## గొర్రెల పంపిణీ కేసులో మరో ట్విస్ట్

హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన గొర్రెల పంపిణీ పథకం కుంభకోణం కేసు లో మరో ట్విస్ట్ ఏర్పడింది. అవకతవకల్లో మరో జాయింట్ డైరెక్టర్ హస్తం ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇప్పటికే నలుగురు ప్రభుత్వ అధికారులు అరెస్ట్ అయ్యారు. ఆ నలుగురు అధికారులను ఏసీబీ మూడు రోజుల పాటు విచారించిన క్రమంలో జాయింట్ డైరెక్టర్ పాత్ర బయటపడింది. రికార్డ్‌ల్లోకి బీనామీ ఖాతాల వివరాలను జేడీ ఎక్కించారు. మొయినుద్దీన్ నుంచి లక్షల రూపాయలు ఫేవర్‌గా జాయింట్ డైరెక్టర్ తీసుకున్నారు. రైతుల డబ్బులు కొట్టేసి మోయినుద్ధిన్, అతడి కుమారుడు ఇక్రం విదేశాలకు పారిపోయారు. దీంతో ఏసీబీ అధికారులు జాయింట్ డైరెక్టర్‌కు నోటీసులు ఇచ్చి విచారించనున్నారు. కాగా గొర్రెల పంపిణీ పథకం బిల్లు చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడ్డ కేసులో ప్రధాన నిందితులైన సయ్యద్ మొహిదొద్దీన్, అతని కుమారుడు ఇక్రముద్దీన్ అహ్మద్.. విదేశాలకు పరారయ్యారు. విదేశాల్లో నక్కి.. బాధిత రైతులకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. కేసు వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. దీంతో ఈ తండ్రీకొడుకులపై లుకౌట్ నోటీసు జారీ చేసేందుకు అవినీతి నిరోధక శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. రైతుల వద్ద నుంచి గొర్రెలను కొనుగోలు చేసి.. అందుకు సంబంధించిన రూ. 2.10 కోట్లను వారి ఖాతాల్లో జమ చేయకుండా దారి మళ్లించిన కేసులో ఏసీబీ అధికారులు ఇప్పటికే నలుగురు ప్రభుత్వ ఉద్యోగులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మరికొందరిని కూడా అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. రూ.2.10 కోట్ల బిల్లు చెల్లింపు వరకే ఇది పరిమితం కాలేదని, మరికొంత మంది రైతుల నుంచి పెద్దమొత్తంలో నిధులు దారి మళ్లించినట్లు ఏసీబీ ప్రాథమిక విచారణలో గుర్తించింది. విదేశాల్లో నక్కిన తండ్రీకొడుకుల్ని విచారిస్తే అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.

## వన్య ప్రాణుల సంరక్షణకు అందరు సహకరించాలి



**హైదరాబాద్ :** ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న పర్యావరణ మార్పులను దృష్టిలో పెట్టుకుని, వన్యప్రాణుల మనుగడ, రక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తూ ప్రతి యేటా మార్చి 3 న ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం జరుపుకుంటున్నామని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం (మార్చి3) సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాంకేతిక అభివృద్ధి, కొత్త ఆవిష్కరణ లను వన్యప్రాణుల రక్షణ కోసం వాడాలనే సంకల్పంతో ఈ యేడు ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాన్ని (వరల్డ్ వైల్డ్ లైఫ్ డే) జరుపుకుంటున్నామని చెప్పారు. జీవ వైవిధ్యం, అన్ని ప్రాణుల మనుగడే సమతుల్యమైన ప్రకృతికి జీవనాధారం. అభివృద్ధి పేరిట అడవులు, ఇతర జంతుజాలం పట్ల మనుషుల వైఖరిలో విపరీతమైన మార్పులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో వన్యప్రాణుల మనుగడపై తీవ్ర ఒత్తిడి చోటు చేసుకుంటుందని తెలిపారు.మనతో పాటు రానున్న తరాలకు కూడా నివాసయోగ్యమైన పరిసరాలు కావాలంటే అన్ని జీవరాసుల మనుగడ, సహజీవన సూత్రాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. అలాగే మనుషుల నిర్లక్ష్యంతో జరుగుతున్న అటవీ అగ్నిప్రమాదాలను నివారించాలి. అటవీ మార్గాల్లో ప్రయాణాల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో వ్యవహరించాలి. ఎండాకాలం జంతువులు, పక్షుల నీటి వసతికి వీలైనంతగా అందరూ సహకరించాలన్నారు. అటవీ నేరాల అదుపుకు, వన్యప్రాణుల వేట, స్మగ్లింగ్ నివారణకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

## ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన రవాణా శాఖ మంత్రి



**హైదరాబాద్ :** రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లాలో ఓ కార్యక్రమానికి వెళ్తుండగా ఆయన హైదరాబాద్ నుంచి షాద్ నగర్ వరకు ఆర్టీసీ బస్సులో ఆకస్మికంగా ప్రయాణించారు. బస్సులో ప్రయణిస్తున్న ప్రయాణికులతో ముచ్చటించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు అందుతున్న ఉచిత ప్రయాణం.. ప్రయాణం వల్ల ఆదా అవుతున్న డబ్బులు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే మరో వెయ్యి కొత్త బస్సులు వస్తున్నాయని ఎవరికి ఇబ్బందులు ఉండవని హామీ ఇచ్చారు. మంత్రి ఆసాంతం నిలబడే ప్రయాణించడం విశేషం. మంత్రి వెంట దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కూడా ఉన్నారు.

## విరిగిన స్టీరింగ్ రాడ్.. పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



**వరంగల్ :** ఓ ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నర్సంపేట నుంచి భోజర్వు గ్రామానికి వెళ్తున్న పల్లె వెలుగు బస్సు చెన్నా రావుపేట మండలం పాపయ్యపేట శివారులో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగే సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారు. స్టీరింగ్ రాడ్ విరగడంతో బస్సు అదుపు తప్పినట్లు స్థానికులు తెలిపారు. ప్రయాణికలో ఒకరికి మాత్రమే స్వల్పంగా గాయాలయ్యాయి. మిగిలిన ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డట్లు డీఎం తెలిపారు. తృటిలో పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## ఉబర్ ఛార్జ్ చూసి ఖంగుతున్న ప్యాసింజర్.. 40 కిమీ దూరానికి..




టెక్నాలజీ పెరగడంతో ఎక్కడికి వెళ్లాలన్నా.. ఉబర్, ఓలా యాప్‌లలో వెహికల్స్ బుక్ చేసుకుని గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో క్యాబ్ చార్జీలు చూసి వినియోగదారులు తప్పకుండా ఖంగుతింటారు. ఇలాంటి సంఘటనలు గతంలో కోకొల్లలుగా వైరల్ అయినప్పటికీ.. తాజాగా ఇలాంటి మరో సంఘటన వెలుగులోకి వచ్చింది. రాజేష్ భట్టాడ్ అనే వ్యక్తి కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ వెళ్లాలనుకున్నారు. ఆ సమయంలో ఉబర్ బుక్ చేసుకోవడానికి ప్రయత్నిస్తే దాదాపు రూ.2000 చూపించింది. ఇది చూసిన రాజేష్ ఒక్కసారిగా షాకయ్యారు. దీనిని స్క్రీన్ షాట్ తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. చివరకు రాజేష్ భట్టాడ్ బస్సులో కేవలం రూ. 265లతో గమ్యస్థానం చేరుకుని కృతజ్ఞతలు చెప్పారు. 40 కిలోమీటర్ల దూరానికి రూ. 2000 చూసి చాలామంది ఆశ్చర్యపోతున్నారు. దీనిపైన పలువురు నెటిజన్లు స్పందిస్తూ.. విమానాశ్రయం దగ్గర చార్జీలు ఎక్కువగా ఉంటాయని, బస్సులో వెళితే చార్జీలు బాగా తగ్గుతాయని కామెంట్స్ చేశారు. గత ఏడాది కూడా బెంగళూరు విమానాశ్రయం నుంచి ఎలక్ట్రానిక్ సిటీకి ఉబెర్ క్యాబ్ ఎక్కువ ఛార్జీలను వసూలు చేసిన స్క్రీన్‌షాట్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. 50 కిలోమీటర్ల రైడ్‌కు రూ. 4,000 వరకు వసూలు చేసినట్లు ఇందులో తెలిసింది. స్క్రీన్‌షాట్ వైరల్ కావడంతో, క్యాబ్ అగ్రిగేటర్ కంపెనీకు నగర రవాణా శాఖ నోటీసులు అందించింది.

# స్పెషల్ ట్రేడింగ్‌లోనూ లాభాల్లో స్టాక్ మార్కెట్లు

**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్లు శనివారం జరిగిన స్పెషల్ ట్రేడింగ్‌లోనూ ఆల్‌టైమ్ హై రికార్డులను సృష్టించాయి. ఉదయం, మధ్యాహ్నం వేర్వేరుగా చేపట్టిన రెండు సెషన్లలో సూచీలు చివరకు లాభాల్లోనే ముగిశాయి. కాగా, ప్రైమరీ (పీఆర్) సైట్‌లో వైఫల్యం లేదా పెను అంతరాయం ఏర్పడినప్పుడు దాన్ని ఎదుర్కొనే సంసిద్ధతను పరీక్షించడానికి అటు బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్‌ఈ), ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్‌ఎస్‌ఈ)ల్లో ఈ ప్రత్యేక ట్రేడింగ్ సెషన్లను చేపట్టారు. వీటిలో భాగంగానే ప్రైమరీ సైట్ నుంచి డిజాస్టర్ రికవరీ (డీఆర్) సైట్‌కు స్పెషల్ లైవ్ ట్రేడింగ్‌ను మార్చి టెస్ట్ చేశారు.

**తొలి సెషన్‌లో..**

తొలి సెషన్‌లో భాగంగా ప్రైమరీ (పీఆర్) సైట్‌లో ఉదయం 9:15 గంటలకు ప్రత్యేక ట్రేడింగ్ ఆరంభమైంది. 45 నిమిషాలపాటు సాగిన ఈ ట్రేడింగ్ 10 గంటలకు ముగిసింది. ఈ క్రమంలో బీఎస్‌ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 114.91 పాయింట్లు లేదా 0.16 శాతం ఎగిసి 73,860.26 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 73,982.12 స్థాయిని తాకింది. ఎన్‌ఎస్‌ఈ సూచీ నిఫ్టీ కూడా 56.25 పాయింట్లు లేదా 0.25 శాతం ఎగబాకి 22,395 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలో 22,420.25 స్థాయిని చేరింది. ఇదే నిఫ్టీకి ఇంట్రా-డే హై రికార్డు కావడం గమనార్హం.

**రెండో సెషన్‌లో..**

రెండో సెషన్‌లో భాగంగా డిజాస్టర్ రికవరీ (డీఆర్) సైట్‌లో ఉదయం 11:30 గంటలకు ప్రత్యేక ట్రేడింగ్ మొదలైంది. గంటపాటు జరిగిన ఈ ట్రేడింగ్ మధ్యాహ్నం 12:30 గంటలకు అయిపోయింది. తొలి సెషన్‌లో ఎక్కడైతే సూచీలు ముగిశాయో అక్కడి నుంచే రెండో సెషన్‌లో ట్రేడింగ్ ఆరంభమైంది. అయితే మొదటి సెషన్‌తో పోల్చితే రెండో సెషన్‌లో మదుపరులు లాభాల స్వీకరణకు దిగారు. ఈ క్రమంలోనే సూచీలు తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ మునుపెన్నడూ లేనివిధంగా సెన్సెక్స్ 73,806.15 పాయింట్ల ఆల్‌టైమ్ హై వద్ద ముగిసింది. ఇంట్రా-డేలోనూ 73,994.70 స్థాయికి చేరి రికార్డును సృష్టించింది. నిఫ్టీ కూడా 22,378.40 పాయింట్ల లైఫ్‌టైమ్ హై వద్ద స్థిరపడింది. దీంతో శుక్రవారం ముగింపుతో చూస్తే సెన్సెక్స్ 60.80 పాయింట్లు లేదా 0.08 శాతం, నిఫ్టీ 39.65 పాయింట్లు లేదా 0.18 శాతం పెరిగినట్లైంది. మరోవైపు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) నిబంధనల ఉల్లంఘనకుగాను ఫైనాన్షియల్ ఇంటిలిజెన్స్ యూనిట్ (ఎఫ్‌ఐయూ) వేసిన 5.49 కోట్ల జరిమానాతో పేటీఎం షేర్లు శనివారం 2.50 శాతానికిపైగా నష్టపోయాయి.




**రూ.2 లక్షల కోట్లు జూమ్**

బీఎస్‌ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ తొలిసారి రూ.394.06 లక్షల కోట్లకు చేరింది. ఈ ఒక్కరోజే సుమారు రూ.2 లక్షల కోట్లు ఎగిసింది. టాటా స్టీల్, టాటా మోటర్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, విప్రో, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్ తదితర సంస్థల షేర్లు ఆకర్షణీయ లాభాలను అందుకున్నాయి. రంగాలవారీగా మెటల్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, రియల్టీ, హెల్త్‌కేర్ ఇండెక్స్‌లు 1.44 శాతం నుంచి 0.75 శాతం వరకు పెరిగాయి. ఇక బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.70 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.67 శాతం పెరిగాయి.

# ఐదు నెలల్లో కోటి మంది కొత్త మదుపర్లు

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) ప్లాట్‌ఫామ్‌పై నమోదైన మదుపర్ల సంఖ్య 9 కోట్లను అధిగమించిందని సంస్థ ప్రకటించింది. గత 5 నెలల్లోనే కోటి మంది కొత్త మదుపర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపింది. గత అయిదేళ్లలో ఎక్స్ఛేంజీ మదుపర్ల సంఖ్య మూడు రెట్లకు పైగా పెరిగింది. డిజిటలీకరణ, మదుపర్లలో అవగాహన పెరగడం, స్టాక్‌మార్కెట్లు బలంగా రాణించడం వంటివి ఇందుకు కలిసొచ్చాయని తెలిసింది. ఎక్స్ఛేంజీలో నమోదైన ఖాతాదారు కోడ్‌ల సంఖ్య 16.9 కోట్లకు చేరింది. 2023 డిసెంబరు చివరికి ఫండ్ సంస్థల నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.50,77,900.36 కోట్లకు చేరింది. నవంబరులో ఈ విలువ రూ.49,04,992.39 కోట్లుగా ఉంది. ఈక్విటీ, హైబ్రిడ్, సొల్యూషన్ ఓరియెంటెడ్ పథకాల్లోని రిటైల్ పెట్టుబడుల విలువ రూ.28,87,504 కోట్లకు చేరింది. ఓపెన్ ఎండెడ్, క్లోజ్డ్ ఎండెడ్ పథకాలు కలిసి రూ.9,872 కోట్లను సమీకరించాయని తెలిసింది. గతేడాది డిసెంబర్ నాటికి క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా ఫండ్లలోకి రూ.17,610.16 కోట్లు వచ్చాయి.




## ఒక్కరోజులో ఎగిసిన షేర్లు.. 100 బిలియన్ క్లబ్‌లోకి డెల్ సీఈవో

ప్రముఖ టెక్నాలజీ కంపెనీ డెల్ సీఈవో మైఖేల్ సాల్ డెల్ 100 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి చేరారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సంబంధిత పరికరాలకు పెరిగిన డిమాండ్‌తో కంపెనీ నాల్గవ త్రైమాసిక ఆదాయం అమాంతం ఎగిసింది. దీంతో డెల్ టెక్నాలజీస్ ఫౌండర్, చైర్మన్, సీఈవో అయిన మైఖేల్ డెల్ సంపద శుక్రవారం మొదటిసారిగా 100 బిలియన్ డాలర్ల మార్కును సాధించింది. ప్రపంచంలోని అతిపెద్ద టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలలో ఒకటైన డెల్ షేర్లు రికార్డు స్థాయికి 32 శాతం జంప్ చేసి, దాని వ్యవస్థాపకుని నెట్‌వర్త్‌ను 13.7 బిలియన్ డాలర్లు పెంచి 104.3 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.8.6 లక్షల కోట్లు) చేర్చాయి. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం డెల్ ఇప్పుడు భారత్ చెందిన గౌతమ్ అదానీ తర్వాత 12వ అత్యంత సంపన్న వ్యక్తిగా నిలిచారు. మైఖేల్ డెల్ సంపదలో దాదాపు సగం తన కంప్యూటర్ల తయారీ కంపెనీ నుంచే వచ్చింది. ఆయన 40 సంవత్సరాల క్రితం ఆస్టిన్‌లోని టెక్సాస్ విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా ఉన్నప్పుడు డెల్ కంపెనీకి ప్రారంభించారు.


# లార్డ్ శార్దూల్ సెంచరీ ధమాకా.. ముంబైకి భారీ ఆధిక్యం

భారత క్రికెట్ అభిమానులు 'లార్డ్' అని పిలుచుకునే శార్దూల్ ఠాకూర్ రంజీట్రోఫీ సెమీస్‌లో అదరగొట్టాడు. రంజీ సెమీఫైనల్స్‌లో భాగంగా తమిళనాడుతో జరుగుతున్న కీలక పోరులో ముంబై తరఫున ఆడుతున్న శార్దూల్.. సెంచరీతో చెలరేగాడు. శార్దూల్ దూకుడుతో తొలి ఇన్నింగ్స్‌లో ముంబై భారీ ఆధిక్యాన్ని దక్కించుకుంది. సెమీస్‌లో ఈ సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్.. 58 బంతుల్లోనే అర్థ సెంచరీ పూర్తి చేయగా 88 బంతుల్లోనే మూడంకెల స్కోరుకు చేరుకున్నాడు. 105 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 109 పరుగులు చేశాడు. శార్దూల్‌కు ఇదే తొలి సెంచరీ కావడం గమనార్హం. తమిళనాడుతో జరుగుతున్న సెమీస్‌లో భాగంగా తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టును 146 పరుగులకే ఆలౌట్ చేసిన ముంబై ఆ తర్వాత బ్యాటింగ్‌లో తడబడింది. 106 పరుగులకే ఆ జట్టు ఏడు వికెట్లు కోల్పోయింది. అజింక్యా రహానే, పృథ్వీ షా, శ్రేయస్ అయ్యర్‌లు దారుణంగా విఫలమయ్యారు. యువ ఆటగాడు ముషీర్ ఖాన్ అర్ధ సెంచరీ (55)తో రాణించినా అతడు ఎక్కువసేపు నిలువలేకపోయాడు. తమిళనాడు కెప్టెన్ సాయికిషోర్ ఫైఫర్‌తో ముంబై బ్యాటింగ్ లైనప్ గజగజ వణికింది. 106 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయిన దశలో క్రీజులోకి వచ్చిన శార్దూల్.. బౌండరీలు, సిక్సర్లతో తమిళనాడు బౌలర్లను బెంబేలెత్తించాడు. 88 బంతుల్లో సెంచరీ చేసిన శార్దూల్.. ఆఖరికి కుల్‌దీప్ సేన్ బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. తనుష్ కొటియాన్ అండతో శార్దూల్ ముంబై స్కోరును 300 మైలురాయిని దాటించాడు. రెండో రోజు మూడో సెషన్‌లో 88 ఓవర్ల ఆట ముగిసే సమయానికి ముంబై.. 9 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. క్వార్టర్స్‌లో సెంచరీలు చేసిన పది, పదకొండో నెంబర్ బ్యాటర్లు తనూష్ కొటియాన్, తుషార్ దేశ్‌పాండేలు ప్రస్తుతం క్రీజులో ఉన్నారు. ముంబై ఆధిక్యం 156 పరుగులుగా ఉంది.



## చరిత్ర సృష్టించిన ఆస్ట్రేలియా టీనేజర్.. వరుసగా రెండో ట్రోఫీ అతడిదే

ఆస్ట్రేలియా టీనేజర్ అలెక్స్ డి మినౌర్ మెక్సికన్ ఓపెన్‌లో చరిత్ర సృష్టించాడు. వరుసగా రెండో ఏడాది కూడా ట్రోఫీ విజేతగా నిలిచాడు. దాంతో, 2012 తర్వాత మెక్సికన్ ఓపెన్ ట్రోఫీని నిలబెట్టుకున్న తొలి ఆటగాడిగా మినౌర్ రికార్డు నెలకొల్పాడు. మెక్సికోలోని అకాపుల్కోలో ఆదివారం జరిగిన ఫైనల్లో మూడో సీడ్ ఆటగాడైన మినౌర్ తన తడాఖా చూపించాడు. వరుస సెట్లలో ఆధిపత్యం చెలాయించిన ఆసీస్ కుర్రాడు.. కాస్పెర్ రూడ్‌పై 6-4, 6-4తో విజయం సాధించాడు. దాంతో, మెక్సికన్ ట్రోఫీని రెండు సార్లు ముద్దాడిన నాలుగో ఆటగాడిగా మినౌర్ రికార్డుల్లోకెక్కాడు. 'అకాపుల్కో నాకు రెండో ఇల్లుతో సమానం. నిరుడు నా ప్రదర్శనతో నిరాశకు గురయ్యా. అయితే.. ఏడాది తర్వాత మళ్లీ ఇక్కడకు వచ్చి టైటిల్ నిలబెట్టుకున్నా. ఇది నిజంగా గొప్ప ఫీలింగ్' అని మినౌర్ తెలిపాడు. నిరుడు భారీ సుడిగాలి మెక్సికో సిటీని అతలాకుతలం చేసింది. ఆ నగరంలో తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఏకంగా 52 మంది ప్రాణాలు కోల్పయారు. దాంతో, నిర్వాహకులు మెక్సికన్ ఓపెన్‌ను రద్దు చేశారు. కానీ, తమ ప్రజల ముఖాల్లో సంతోషం చూసేందుకు టోర్నీ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. చివరకు వాళ్లు అనుకున్నట్టుగానే టోర్నీ బాగా సక్సెస్ అయింది. ఫైనల్లో ఓడిన కాస్పర్ రూడ్ తొలి ఏటీపీ 500 టైటిల్‌ను మిస్ అయ్యాడు.



స్పోర్ట్స్

## చిరకాల ప్రత్యర్థుల మ్యాచ్‌కు ఫుల్ క్రేజ్.. టికెట్ కనీస ధర 1.8 కోట్లు



ప్రపంచ క్రికెట్‌లో టోర్నీ ఏదైనా భారత్ పాకిస్థాన్ మ్యాచ్ అంటే అభిమానులకు పండుగే. చిరకాల ప్రత్యర్థులైన ఇండియా, పాకిస్థాన్‌లు ఎక్కడ తలపడినా ఇరుదేశాల ఫ్యాన్స్‌తో స్టేడియం నిండిపోతుంది. ఈ ఏడాది జూన్‌లో జరిగే టీ 20 వరల్డ్ కప్‌లో దాయాది జట్లు మరోసారి విశ్వవేదికపై తలపడనున్నాయి. దాంతో, ఆ మ్యాచ్ టికెట్లకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో నిర్వాహకులు ఒక్కో టికెట్ కనీస ధరను రూ.1.4 కోట్లుగా నిర్ణయించారు. అదనపు చార్జీ రూ. 4 లక్షలు కలిపి మొత్తంగా టికెట్ ధర రూ. 1.8 కోట్లు. అయినా సరే ఫ్యాన్స్ తగ్గేదేలే అంటున్నారు. ఐసీసీ ఇప్పటికే టీ20 వరల్డ్ కప్ టికెట్లను పబ్లిక్ బ్యాలట్ ద్వారా అమ్ముతోంది. టికెట్ల ధరను 6 డాలర్ల నుంచి 25 డాలర్లుగా నిర్ణయించింది. భారతీయ కరెన్సీలో కనీస టికెట్ ధర రూ.497 కాగా అత్యధిక ధర రూ.2,070. ఈ విండో ద్వారా ఏకంగా 2.60 లక్షల టికెట్లను ఐసీసీ అమ్మకానికి పెట్టింది. వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యాక ఒక్కొక్కరు ఒక్క మ్యాచ్‌కు ఆరు టికెట్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. అలా ఎన్ని మ్యాచ్‌లకైనా ఒక్కరు ఆరేసి టికెట్లకు అప్లై చేయవచ్చు. అంటిగ్వా సమయం ప్రకారం ఫిబ్రవరి 7వ తేదీ రాత్రి 23 గంటల 59 నిమిషాల వరకు టికెట్లకు అప్లై చేసుకొనే వీలుంది.

**జూన్ 9వ తేదీన**

భారత్, పాకిస్థాన్‌లు నిరుడు ఆసియా కప్, వన్డే వరల్డ్ కప్‌లో తలపడ్డాయి. అయితే.. ఈ రెండు టోర్నీలోనూ దాయది జట్టును టీమిండియా చిత్తుగా ఓడించింది. మళ్లీ టీ20 ప్రపంచకప్‌లో భారత్, పాక్‌లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. వెస్టిండీస్, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మోగా టోర్నీ జూన్ 1వ తేదీన షురూ కానుంది. జూన్ 9వ తేదీన న్యూయార్క్ వేదికగా ఇండియా, పాకిస్థాన్ మ్యాచ్ జరుగనుంది.

**ఓటీటీలో డాక్యుమెంటరీ సిరీస్**

ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల సరిగ్గా లేని కారణంగా భారత్, పాక్‌లు ఐసీసీ ట్రోఫీ ల్లో మాత్రమే పోటీపడుతున్నాయి. దాంతో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ఇండో పాక్ జట్ల మధ్య ఉన్న క్రికెట్ వైరాన్నిడాక్యుమెంటరీగా రూపొందించింది. ఫిబ్రవరి 1 శుక్రవారం 'గ్రేటెస్ట్ రైవర్లీ' పేరుతో చిత్రీకరించిన డాక్యుమెంటరీ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. 'లైట్స్, కెమెరా, క్లీన్ బౌల్డ్. చరిత్రలో భాగమైన, గ్రేటెస్ట్ రైవర్లీ నెట్‌ఫ్లిక్స్‌లో త్వరలోనే రాబోతోంది' అనే క్యాప్షన్‌తో ఉన్న ఆ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అవుతోంది.



# బరువెక్కి పోతున్నాయ్.. కుర్రాళ్ల గుండెలు!

కేతికాశర్మ తెలుగునాట సుపరిచితమైన పేరు. ఆమె కెరీర్‌లో చేసిన సినిమాలు మూడు నాలుగే అయినా ఆమె అందం, గ్లామర్‌తో యూత్‌లో మంచి ఫాలోయింగ్‌నే తెచ్చి పెట్టాయి. 2021లో ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ కుమారుడు ఆకాశ్ పూరి హీరోగా తెరకెక్కిన రొమాంటిక్ చిత్రంతో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. ఇప్పటివరకు తెలుగులో రొమాంటిక్, లక్ష్య బ్రో రంగరంగ వైభవంగా అనే సినిమాల్లో పేరున్న నటులకు జంటగానే చేసినప్పటికీ ప్రస్తుతం అవకాశాల విషయంలో చాలా వెనకబడింది. ఇప్పటివరకు తెలుగు తప్పా మరే భాషలోను సినిమాలు చేయని ఈ సుందరి అల్లు అర్జున్‌తో కలిసి ఆహా యాడ్‌లోనూ కనిపించి మెప్పించింది. అయితే చాలామంది ముంబై భామల కన్నా గ్లామర్, అందం పుష్కలంగా ఉన్న ఈ ముద్దుగుమ్మకు ఛాన్సులు రాకపోవడంపై అమె అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అవకాశాలు ఆమె తలుపు తట్టడం లేదా లేదా ఆమె కావాలని అంగీకరించడం లేదా అనే కామెంట్లు కూడా నెట్టింట చర్చకు వస్తున్నాయి. ఇవన్ని ఇలా ఉంటే ప్రస్తుతం చేతిలో ఏ సినిమా లేని ఈ ఢిల్లీ సుందరి నిత్యం ఏదోరకంగా వార్తల్లో నిలుస్తూ వస్తోంది. తరచూ హాట్ ఫోటోషూట్లతో, వీడియోలతో కుర్రాళ్ల గుండెలను బరువెక్కిస్తూ వారికి నిద్ర లేకుండా చేస్తోంది. తాజాగా ఓ బీచ్‌లో అమ్మడు తన ఫొటోలతో చేసిన రచ్చతో కుర్రకారు మతులు ఎక్కడికో పోయాయి. ఇంత అందం ఆడవికాచిన వెన్నెల అవుతుంది కదా.. టాలీవుడ్‌లో హీరోయిన్ల కొరత ఉందంటూ చాలా మంది పదే పదే చెబుతుంటారు అలాంటి వాళ్లు ఈ అమ్మడికి ఛాన్సులు ఇవ్వొచ్చు కదా అంటూ ఆమె ఫాలోవర్స్ కోరుతున్నారు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ పడుతున్న ఈ కష్టంతోనైనా భవిష్యత్‌లో అవకాశాలు అమ్మడి తలుపులు తడతాయేమో చూడాలి.



## ప్రభాస్ కల్కి 2898 ఏడీ ట్రైలర్ లాంఛ్ టైంపై ఆసక్తికర గాసిప్!

గ్లోబల్ స్టార్ హీరో ప్రభాస్ నటిస్తోన్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ కల్కి 2898 ఏడీ సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో మహానటి ఫేం నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్ వీడియో నెట్టింట వైరల్ అవుతూ.. వ్యూస్ పంట పండిస్తోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ అప్‌డేట్‌కు సంబంధించిన పుకారు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. లేటెస్ట్ టాక్ ప్రకారం ఏప్రిల్ మొదటి వారంలో కల్కి 2898 ఏడీ ట్రైలర్‌ను లాంఛ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. దీనిపై అధికారిక రావాల్సి ఉంది. ఈ చిత్రంలో దీపికా పదుకొనే , దిశా పటానీ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. లెజెండరీ బాలీవుడ్ యాక్టర్ అమితాబ్ బచ్చన్‌తోపాటు కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సిల్వర్ స్క్రీన్‌పై ప్రభాస్-రాజేంద్రప్రసాద్ కాంబినేషన్ తొలిసారి కావడం విశేషం. రాజేంద్రప్రసాద్ మరి ఎలాంటి పాత్రలో కనిపించబోతున్నారన్నది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన టైటిల్, గ్లింప్స్ వీడియో నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఇప్పటికే లాంఛ్ చేసిన కల్కి 2898 ఏడీ టీజర్ మిలియన్ల సంఖ్యలో వ్యూస్‌తో హాట్ టాపిక్‌గా మారుతోంది. ఈ చిత్రాన్ని 2024 మే 9న విడుదల చేస్తునున్నారు మేకర్స్. వైజయంతీ మూవీస్ బ్యానర్‌లో వచ్చి ట్రెండ్ సెట్టర్స్‌గా నిలిచిన జగదేకవీరుడు అతిలోక సుందరి, మహానటి సినిమాలు ఇదే రోజు రిలీజైన విషయం తెలిసిందే. మరి సేమ్ డేట్‌న రిలీజవుతుండటంతో కలెక్షన్లు ఎలా ఉండబోతున్నాయంటూ తెగ ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నారు అభిమానులు. ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్లు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మరోవైపు కల్కి 2898 ఏడీ రైడర్స్ (యూనిఫార్మ్‌డ్ విలన్ ఆర్మీ) కాస్ట్యూమ్స్ మేకింగ్, అసెంబ్లింగ్ వీడియో సినిమాపై నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## ‘ఆ ఒక్కటీ అడక్కు’ మ్యూజికల్ ప్రమోషన్ షురూ..

టాలీవుడ్ హీరో అల్లరి నరేష్ నటిస్తున్న తాజా చిత్రం ‘ఆ ఒక్కటీ అడక్కు’. ఈ సినిమాకు మల్లి అంకం దర్శకత్వం వహిస్తుండగా.. ఫరియా అబ్దుల్లా కథనాయికగా నటిస్తుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి మ్యూజికల్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ ఓ మేడం ఐయామ్ వెయిటింగ్ ఫర్ యూ అంటూ సాగే ప్రోమోను మేకర్స్ విడుదల చేశారు. పూర్తి పాటను మార్చి 04న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు.



## ఇది సామాన్యుల కథ..

### ఎమోషనల్‌గా ‘షరతులు వర్తిస్తాయి!’ ట్రైలర్

కీడా కోలా ఫేమ్ టాలీవుడ్ యువ నటుడు చైతన్య రావు, భూమి శెట్టి ప్రధానపాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ‘షరతులు వర్తిస్తాయి’. ఈ సినిమాకు కుమార స్వామి (అక్షర) దర్శకత్వం వహిస్తుండగా.. స్టార్ లైట్ స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై శ్రీలత, నాగార్జున సామల, శ్రద్ధ, శ్రీకుమార్ గుండా తదితరులు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా మార్చి 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్స్ వేగం పెంచారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు ‘పన్నెండు గుంజాల’ సాంగ్, టీజర్ విడుదల చేయగా.. ప్రేక్షకుల వద్ద నుంచి మంచి ఆదరణ లభించింది. ఇప్పుడు తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. ఈ దేశంలో ఉన్న ఎనభై శాతం సామాన్యుల కథనే మన ఈ సినిమా అన్న డైలాగ్‌తో ట్రైలర్ మొదలవుతుంది.. కరీంనగర్ జిల్లాలో ఓ మధ్య తరగతి కుటుంబానికి చెందిన చిరంజీవి (చైతన్య రావు) తల్లి, తమ్ముడు, చెల్లి బాధ్యతలను భుజానికి ఎత్తుకొని బ్రతుకుతుంటాడు.



## పూజా హెగ్డే ఈజ్ బ్యాక్.. త్రివిక్రమ్‌పై మళ్లీ ట్రోల్స్!

‘గుంటూరు కారం’ మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చింది. దీంతో డైరెక్టర్ త్రివిక్రమ్‌ని మహేశ్ ఫ్యాన్స్ మళ్లీ ట్రోల్ చేస్తున్నారు. అసలు ఎందుకిలా చేశారు అని తెగ బాధపడుతున్నారు. అయితే ఇదంతా కూడా కేవలం రెండు ఫొటోల వల్లే వచ్చింది. మళ్లీ ఏమైంది? ఇప్పుడు ఏం జరుగుతోంది? మహేశ్-త్రివిక్రమ్ కాంబోలో మూడో సినిమాగా ‘గుంటూరు కారం’ తీశారు. అప్పుడెప్పుడో 2021 మేలో లాంచ్ చేశారు. అప్పుడు ఫుల్ ఫామ్‌లో ఉన్న పూజా హెగ్డేని హీరోయిన్‌గా ఫిక్స్ చేశారు. కానీ షూటింగ్ లేటు అయ్యేకొద్దీ స్టోరీ దగ్గర నుంచి ఫైట్ మాస్టర్స్, సినిమాటోగ్రాఫర్ ఒక్కొక్కరుగా మారుతూ వచ్చారు. మరి పూజా హెగ్డేని తప్పించారో, తప్పుకొందో తెలీదు గానీ సినిమా నుంచి సైడ్ అయిపోయింది. దీంతో మహేశ్ సరసన శ్రీలీల, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా చేశారు. మొన్నీమధ్ సంక్రాంతికి థియేటర్లలో ఈ సినిమా రిలీజ్ కాగా ఫ్యాన్స్ అయితే త్రివిక్రమ్‌ని మాములుగా ట్రోల్ చేయలేదు. ఓటీటీలోకి వచ్చిన తర్వాత మరో దఫా ట్రోలింగ్ జరిగింది. ఇప్పుడు అప్పట్లో షూటింగ్ సందర్భంగా తీసిన ఫొటోల్ని ఎవరో సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు. ఇందులో మహేశ్‌తో పాటు పూజా హెగ్డే కూడా కనిపించింది. ఈ ఫొటోల బట్టి చూస్తే శ్రీలీల చేసిన అమ్ము పాత్ర పూజా చేయాల్సింది. మీనాక్షి చేసిన బుజ్జి పాత్ర శ్రీలీల చేయాలి. తాజాగా రిలీజైన ఫొటోల్లో పూజా లుక్ బాగుంది. దీంతో ఇంత మంచిగా ఉన్న హీరోయిన్?ని ఎందుకు తీసేశార్రా బాబు అని నెటిజన్స్ దర్శకుడిని ట్రోల్ చేస్తున్నారు. అదీ సంగతి.



Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com